
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 6 ఫిబ్రవరి 2025

షరా.. మామూలే..!

నష్టాలను మిగిల్చిన ఉలవ పంట

అరకొర దిగుబడికి అంతంత మాత్రమే ధర

పెట్టుబడి కూడా రాదని రైతుల ఆవేదన


ఉలవ పంటను తొలగిస్తున్న కూలీలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఏ పంట పెట్టిన రైతన్నకు నష్టాలే మిగులుతున్నాయి. ప్రత్యామ్నాయ పంటగా సాగు చేసిన ఉలవ సైతం నష్టాలనే మిగిల్చింది. పెట్టుబడి రాకపోగా, చేతి నుంచి మరింత వేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో విత్తనాన్ని అందించడంతో మండలంలో దాదాపు 2,100 ఎకరాల్లో ఉలవ పంటను సాగు చేశారు. ఈ ఏడాది వర్షాలు, మంచు అధికంగా కురవడంతో పైరు ఎదుగుదల ఆశాజనకంగా ఉన్నా, కాయలు తక్కువ వచ్చాయి. దీంతో దిగుబడి చాలా తగ్గిపోయింది.

ఖర్చు ఎక్కువ, దిగుబడి తక్కువ

ఉలవ పంట సాగు కోసం రైతులు ఎకరాకు రూ.7వేలు ఖర్చు చేశారు. అయితే గత ఏడాది ఉన్న ధరలు ఈ ఏడాది లేకుండా పోయాయి. అలాగే పంట సాగు ఖర్చులు కూడా పెరిగాయి. దీంతో పెట్టుబడి అమాంతం పెరిగింది. అరకొర దిగుబడులకు ధరలు లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఎకరాకు కేవలం క్వింటా ఉలవ మాత్రమే దిగుబడి వచ్చింది. గతంలో క్వింటా రూ.7వేలు పలకగా, ప్రస్తుతం క్వింటా రూ.3,800 మాత్రమే ధరలున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కూలీలకు డిమాండ్

పంట సాగు సంగతి దేవుడేరుగు. దాన్ని కోత కోయడం తీవ్ర ఇబ్బందిగా పరిణమించింది. ఎక్కువ విస్తీర్ణంలో ఉలవ పంటను సాగుచేయడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. దీంతో రైతులు గత్యంతరం లేక పొరుగు ప్రాంతాలనుంచి రవాణా ఖర్చులు భరిస్తూ రోజుకు ఒక కూలీకి రూ. ఐదువందలు చెల్లిస్తున్నారు. కూలీలు డిమాండ్ పెరగడంతో కూలీలు దొరికేవరకు రైతులు వేచి ఉండాల్సిన పరిస్థితి.

నూర్పిడి యంత్రానికి గిరాకీ

ఉలవపంట నూర్పిడి యంత్రానికి గిరాకీ పెరిగింది. యంత్రాల కోసం రోజుల తరబడి పడిగాపులు గాయాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉలవ పంటను నూర్పిడి చేయడానికి గంటకు రూ.14వందలు అద్దె చెల్లించాల్సి వస్తోంది వీటికి తోడు నూర్పిడి యంత్రంలో పనిచేసే ముగ్గురు కూలీలకు ఒక్కొక్కరి రూ.వంద చొప్పున చెల్లించాల్సి వస్తోంది. మొత్తం రూ.17వందలు గంటకు చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళారుల చేతివాటం

రైతులు పండించిన ఉలవ పంటకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. రైతుల కష్టాన్ని కొంతమంది దళారులు దోచుకుంటున్నారు. క్వింటాకు నాలుగు కేజీలు తరుగు కింద తీసుకుంటున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉలవను కొనుగోలు చేసి ఉంటే తాము దళారులను ఆశించేవారం కాదని రైతులంటున్నారు.

అనుకున్నదొక్కటి.. అయినదొక్కటి


గతంలో ధరలు చూసి ఈఏడాది కూడా అవే ధరలుంటాయని ఆశించాం. ఎకరాకు రూ. 7వేలు ఖర్చు పెట్టి ఉలవ పంట సాగుచేశా. చివరికి మిగిలింది అప్పులు మాత్రమే. ప్రభుత్వం ఉలవ రైతులను ఆదుకోవాలి.

- నారాయణరెడ్డి, రైతు, నారప్పగారిపల్లి

పంటను వదలలేక..


ఎంతో ఆశతో అప్పు చేసి ఉలవ పంటను సాగు చేశా. నాలుగు ఎకరాల్లో ఉలవ పంటను సాగుచేస్తే కట్టె మాత్రమే మిగిలింది. పంటను పొలాల్లో వదిలేస్తే పరువు పోతుందని, ఉన్న అప్పులకు తోడు మరింత అప్పు చేసి పంటను తొలగించాం. రైతు కష్టం శత్రువుకూడా రాకూడదు. ప్రభుత్వం రైతుల కష్టాన్ని గురించి ఆదుకోవాలి.

- రుద్రారెడ్డి, రైతు, గాజుకుంటపల్లి

అప్పుల పాలయ్యాం..


ఉన్న అప్పులకు కనీసం వడ్డీలైనా వస్తాయని ఉలవ పంట సాగు చేశా. అయితే ఉన్న అప్పులకు మరిన్ని అప్పులు తోడయ్యాయి. ప్రభుత్వం అందించిన సబ్సిడీ విత్తనాలను మూడు ఎకరాల్లో సాగు చేస్తే చివరకు అప్పులే మిగిలాయి. రైతు కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి. ఉలవ రైతుకు ప్రభుత్వం పరిహారం అందించాలి.

- నాగరాజు, రైతు, ఎం.కొత్తపల్లి

తూకాల్లో తేడా

తక్కువ తూకంతో వస్తున్న బియ్యం బస్తాలు

స్టాకు పాయింట్ నుంచే తక్కువగా వస్తున్న పరిస్థితి

50 కిలోల బస్తాలో 12 కిలోలు తక్కువ

గగ్గోలు పెడుతున్న డీలర్లు


38 కేజీలు మాత్రమే వచ్చిన బియ్యం బస్తా

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పేదలకు చౌక ధరల దుకాణాల నుంచి అందించే బియ్యం సరఫరాలో దోపిడీ జరుగుతోంది. స్టాకు పాయింట్ నుంచే తక్కువ తూకంతో బస్తాలు సరఫరా అవుతుండటంతో డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. 50 కిలోల బస్తాలో 12నుంచి 15కిలోల తగ్గింపుతో సరఫరా చేస్తున్నారని డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత తక్కువగా బియ్యం సరఫరా చేస్తే లబ్ధిదారులకు ఎలా సరఫరా చేయాలంటూ వారు తలలు పట్టుకుంటున్నారు. బఫర్ పేరుతో ప్రతినెలా బియ్యం తక్కువగా వస్తుండటంతో కార్డుదారులకు సమాధానం చెప్పలేక డీలర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ప్రతినెలా తక్కువే..

ధర్మవరం పట్టణ, రూరల్ పరిధిలో 113 రేషన్ షాపులు, 52459 రేషన్‌కార్డులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సుమారు 700నుంచి 750టన్నుల వరకు ప్రతినెలా కందుకూరు గోడౌన్ నుంచి ధర్మవరం స్టాకు పాయింట్‌కు బియ్యం వస్తున్నట్లు రికార్డుల్లో చూపుతు న్నారు. అక్కడి నుంచి డీలర్లకు సరఫరా చేస్తారు. ఈక్రమంలోనే మండలంలోని తుమ్మల గ్రామంలోని 46వ రేషన్‌షాపునకు బియ్యం సరఫరా చేశారు. అయితే ప్రతినెలా బస్తాల్లో తక్కువగా బియ్యం వస్తుండటం గమనించిన డీలర్ తూకాలు వేయించాడు. దీంతో ఒక బస్తా 38.56కేజీలు, మరో బస్తా 40కేజీలు మాత్రమే ఉన్నాయి. ఇలా ప్రతి నెలా తక్కువ తూకాలతో బియ్యం బస్తాలు సరఫరా చేస్తే కార్డుదారులకు ఏమని సమాధానం చెప్పాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదివరకే బడన్నపల్లి, దర్శినమల, చిగిచెర్ల, సుబ్బరావుపేట, తిప్పేపల్లి, మల్లేనిపల్లి తదితర గ్రామాల్లో కూడా తక్కువ తూకాలు వస్తున్నట్లు ఆయా డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చర్చించుకున్న పలువురు డీలర్లు ఇటీవల తమ సమస్యను సీఎస్‌డీటీకి విన్నవించడానికి వెళ్లగా ఆయన అందుబాటులోకి రాకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. అయితే 'తేడా' వచ్చిన బియ్యం ఎక్కడికి పోతున్నాయని పలువురు డీలర్లు ప్రశ్నిస్తున్నారు.

వైసీపీ హయాంలోని అక్రమాలతోనే తంటాలు

వైసీపీ పాలనలో కొంతమంది ఆ పార్టీకి సంబంధించిన డీలర్లు మాఫియాతో చేతులు కలిపి బియ్యాన్ని ఇష్టారాజ్యంగా సరఫరా చేశారు. వాటిని రికవరీ చేసేందుకు ఇలా బియ్యం తగ్గిస్తున్నారని ప్రస్తుత డీలర్లు ఆరోపిస్తున్నారు. బఫర్ తక్కువ వచ్చాయని చెబితే గ్రామాల్లో ప్రజలు వినరని గగ్గోలు పెడుతున్నారు. కొంతమంది అధికారులు బియ్యం మాఫియాతో కుమ్మక్కై పేదలకు అందాల్సిన ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే తూకాల్లో అక్కడినుంచే తేడాలు వస్తున్నట్లు పలువురు డీలర్లు ఆరోపిస్తున్నారు.

నా దృష్టికి రాలేదు

తూకాలు తక్కువగా వస్తున్నాయన్న విషయం నా దృష్టికి రాలేదు. బియ్యంబస్తాల ప్రకారం కాకుండా క్వింటాళ్ల ప్రకారం పంపిణీ చేస్తాం. ఏదేమైనా ఈ విషయానికి సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకుని, తదుపరి చర్యలు తీసుకుంటాం.

- ప్రసన్నకుమార్, ధర్మవరం ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్

పద్ధతిలేని మాస్టారు సస్పెన్షన్

కొత్తచెరువు/గోరంట్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గోరంట్ల పట్టణంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావును సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుడు, అంధుడైన హెచ్‌ఎం నాగేశ్వరరావు విద్యార్థుల పట్ల అసభ్యకరకంగా ప్రవర్తిస్తూ, పాఠశాలలోనే మద్యం సేవించి, బాలికలతో దురుసుగా మాట్లాడం వంటి వాటిపై పిల్లల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆయనపై పోక్సో కేసు కూడా నమోదు చేయించినట్లు తెలిపారు.

హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

ఇక్కడి పండ్లు నాణ్యత, రుచిలో మేటి

మాది రైతు ప్రభుత్వం.. అండగా నిలుస్తాం

హంద్రీనీవా విస్తరణ పనులను ప్రారంభిస్తాం

అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌లో మంత్రి పయ్యావుల


జ్యోతిని వెలిగిస్తున్న మంత్రి కేశవ్, అనంత కలెక్టర్, ఎమ్మెల్యేలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా గుర్తింపు పొందిన అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం 'అనంత హార్టికల్చర్ కాంక్లేవ్'ను ఆయన ప్రారంభించారు. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. వాతావరణ పరిస్థితులను అనుగుణంగా కొత్త వంగడాలను ప్రవేశపెట్టాలని ఇక్కడి రైతులు కోరుకుంటారని అన్నారు. ప్రకృతి శాపాన్ని, కోపానికి ధైర్యంగా ఎదుర్కొంటున్న జిల్లా రైతులకు హార్టికల్చర్ కాంక్లేవ్‌ను అంకితం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమ నిర్వహణకు ప్రత్యేక చొరవ చూపిన కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను మంత్రి అభినందించారు. సీఎం హాజరయ్యే స్థాయిలో త్వరలో ఈ సమావేశాలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో 64 సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 14 మంది ఎమ్మెల్యేలను గెలిపించిన ప్రజలు, రైతుల రుణం తీర్చుకుంటామని అన్నారు. నారు నుంచి కోత వరకు అనేక సమస్యలున్నాయని అన్నారు. జిల్లాలో టమోటా, ఎండు మిరప, దానిమ్మ, సీతాఫలం తదితర పంటలకు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కోతకు ముందు, తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దిగుబడి, నాణ్యత పెంపు, మార్కెటింగ్ తదితర అంశాలను ఇక్కడ చర్చించుకొని, ముందుకు వెళతామని అన్నారు. బ్రాండ్ చాలా ముఖ్యమని, ఉద్యాన పంటల సాగులో బ్రాండ్ అనంతను సృష్టించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఇప్పటికే గల్ఫ్ దేశాలకు అనంత అరటి ఎగుమతి అవుతోందని, ఢిల్లీలో మన కర్బూజకు సహజంగానే గిరాకీ పెరిగిందని అన్నారు. ఢిల్లీలో కర్బూజను అమ్మి.. విమానంలో తిరిగి వచ్చే రైతులు (తరువాయి 7లో)


వీఆర్‌ఓ ల్యాప్‌టాప్‌ను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

చివరికి ఏమవుతుందో..?

నాలుగేళ్లుగా నానుతున్న నకిలీ పట్టాల వ్యవహారం

ఇటీవల వీఆర్‌ఓ, సర్వేయర్ అరెస్ట్.. బెయిల్

బాధితులకు దక్కని న్యాయం

నకిలీ పట్టాల కథ కంచికేనా ?

హిందూపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నకిలీ పట్టాల వ్యవహారం హిందూపురం ప్రాంతంలో నాలుగేళ్లుగా నానుతోంది. వందల సంఖ్యలో నకిలీ ఇంటి పట్టాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. కొందరు అక్రమార్కులు పట్టా భూమిలో ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ సృష్టించి ఫోర్జరీ సంతకాలతో విక్రయించి లక్షలు పోగేసుకున్నారు. ఈ అక్రమాలను ఆలస్యంగా తెలుసుకున్న భూయజమాని అయిన రిటైర్డ్ సబ్‌రిజిస్ట్రార్‌తోపాటు నకిలీ పట్టా పొందినవారు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై అప్‌గ్రేడ్ పోలీసులు కేసు నమోదు చేసి మండల సర్వేయర్, వీఆర్‌ఓను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. సొంత పూచీకత్తుపై కోర్టు వారికి బెయిల్ ఇచ్చింది. అయితే దీనివల్ల నష్టపోయిన వందలాది మంది బాధితులకు ఒనగూరిన మేలు ఎంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత నాలుగేళ్ల కాలంలో నకిలీ ఇంటి పట్టాల వ్యవహారంపై పదుల సంఖ్యలో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. అయితే ఇందులో ఒకరిద్దరు తప్ప మిగిలినవారి ఫిర్యాదులు బుట్టదాఖలు చేశారు. దీంతో నకిలీ పట్టాల వ్యవహారం కథ కంచికేనా అంటూ బాధితులు వాపోతున్నారు.


వైసీపీ పాలనలో విచ్చలవిడిగా నకిలీలు

గడచిన ఐదేళ్ల వైసీపీ హయాంలో హిందూపురం పట్టణం, మండలంలో సుమారు వెయ్యి నుంచి 1500పట్టాలకు నకిలీ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు సృష్టించి విక్రయించారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా హిందూపురం మండలంలో భూములకు బాగా విలువ ఉన్న ప్రాంతాలైన కిరికెర, తూమకుంట, కగ్గల్లు, మణేసముద్రం, పూలకుంట, పట్టణ పరిధిలోని కొల్లకుంట, ఆటోనగర్, ఇందిరమ్మ కాలనీ లాంటి ప్రాంతాల్లో వందల సంఖ్యలో నకిలీ పట్టాలు సృష్టించారు. ఇందులో వైసీపీ నాయకుల పాత్ర ఉన్నట్లు పోలీసులు అరెస్ట్ చేసిన వ్యక్తుల ద్వారా తెలిసింది. ఒక ఇంటిపట్టా లక్ష నుంచి రూ.2లక్షల దాకా విక్రయించారు. ఈ లెక్కన కనీసం వెయ్యి పట్టాలకు కోట్లలోనే చేతులు మారినట్లు తెలుస్తుంది. ఇందులో అధికారులకు చేరిందెంత, వైసీపీ నాయకుల జేబులకు వెళ్లిందెంత అనేది వారికే ఎరుక.

బాధితులకు ఏం న్యాయం చేసినట్లు?

సర్వేయర్, వీఆర్‌ఓను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. అయితే తమకు ఏం న్యాయం జరిగినట్లు అని ఫిర్యాదు చేసిన వ్యక్తులు ప్రశ్నిస్తున్నారు. అరెస్ట్ అయినవారితోపాటు వారి వెనుకాల ఒకరిద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. అలాగే గతంలో ఇక్కడ పని చేసిన ఒకరిద్దరు ముఖ్య అధికారుల పాత్ర కూడా ఉందని సమాచారం. వీరిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి. దీంతో బాధితులకు ఏమైనా న్యాయం చేసే అవకాశం లభిస్తుంది. అలాకానీ పక్షంలో హిందూపురంలో నకిలీ పట్టాలతో మోసపోయామని చెప్పుకోవడం తప్ప బాధితులకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని తెలు స్తుంది. జిల్లా ఉన్నతాధికారులు తహసీల్దార్ కార్యాలయంలో డైక్లాట్ ప్రకారం లోతుగా విచారణ చేస్తే ఎవరి తప్పు ఇందులో ఉందని వెలుగులోకి రావచ్చు. జిల్లా కలెక్టర్ ఈ దిశగా చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాల్సిందే.

నకిలీలు దొరికినా చర్యలేవీ..?


పోలీసులు ఇటీవల సర్వేయర్, వీఆర్ఓను అదుపులోకి తీసుకుని విచారించారు. హిందూపురం ప్రాంతంలో విలాసవంతమైన భవనం ఏర్పాటు చేసుకుని అందులో నకిలీ ఇంటి పత్రాలు తయారు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వీఆర్‌ఓ వెల్లడించినట్లు తెలిసింది. ఇంత పెద్దఎత్తున నకిలీ పత్రాలు తయారు చేసినట్లు పోలీసు విచారణలో వెల్లడైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇలా అయితే మరికొంతమంది ఇలాంటి వ్యవహారాలకు పాల్పడే ప్రమాదం ఉంది. కలెక్టర్ లోతుగా విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

నాడు


కంకర తేలి అధ్వానంగా మేరెడ్డిపల్లి రోడ్డు


తారు రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

నేడు



మాటిచ్చాం.. రోడ్డు నిర్మించాం..!

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

గోరంట్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం మేరెడ్డిపల్లికి తారురోడ్డు వేశామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. రూ.1.14 కోట్ల ఉపాధి నిధులతో నిర్మించిన ఈ రోడ్డును మంత్రి సవిత బుధవారం ప్రారంభించారు. గోరంట్లలో రూ.6 కోట్లతో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. బూదిలి వద్ద చిత్రావతి వంతెను రూ.8 కోట్లతో నిర్మిస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. వైసీపీ హయాంలో అభివృద్ధి ఏమీ జరగలేదని, అందుకే 11 సీట్లు ఇచ్చి జగన్‌కు జనం బుద్ధి చెప్పారని అన్నారు. అనంతరం గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో మంత్రి పూజలు చేశారు. మేరెడ్డిపల్లికి చెందిన 11 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్రకుమార్, పీఆర్ డీఈ వెంకటరమణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయి సన్నిధిలో చైనా సంబరాలు


చైనా కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన

పుట్టపర్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయికుల్వంతు సభామండపంలో చైనా భక్తులు ప్రదర్శించిన సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. చైనా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రెండో రోజు బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ చైనా భక్తులను సన్మానించారు. అనంతరం వారంతా సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.



వారధిగా ఉంటూ సాయం చేయాలి

జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): న్యాయసేవాధికార సంస్థ, న్యాయ సహాయం కోసం వచ్చే బాధితుల మధ్య వారధిగా ఉంటూ సహాయాన్ని అందించేవారే పారా లీగల్ వలంటీర్లు అని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బార్ అసోసియేషన్ హాలులో పారా లీగల్ వలంటీర్లకు మొదటి రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల గురించి వివరించారు. బాధితులకు న్యాయ సహాయం అందించే సమయంలో తమ పాత్ర ఎలా నిర్వర్తించాలో వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సీనియర్ న్యాయవాదులు పద్మజ, నామాల హరికృష్ణ, ఇటికె నల్లప్ప పాల్గొన్నారు.

గిరిజనుల చైతన్యమే ధ్యేయం

జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి రామాంజనేయులు

ఇంటర్వ్యూ interview


రామాంజనేయులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనులను చైతన్యం చేయడమే ధ్యేయంగా పని చేస్తానని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు పేర్కొన్నారు. గిరిజనులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, వాటి లబ్ధిని పొందేలా చర్యలు తీసుకుంటానన్నారు. సబ్సిడీ రుణాలు రాగానే, అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రశ్న : ధర్తీ ఆబా జన్ జాతీయ ఉత్కర్ష్ గ్రామ అభియాన్ పనులు ఎలా జరుగుతున్నాయి..?

జవాబు: జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ పథకం పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఎలక్ట్రిసిటీ పనులు పూర్తయ్యాయి. జల్‌జీవన్ మిషన్, అగ్రికల్చర్, స్కిల్ డెవలప్‌మెంట్ పనులు త్వరలో ప్రారంభమవుతాయి.

ప్ర : వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారా..?

జ: వసతిగృహాల్లో ఇప్పటికే చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని బెడ్‌షీట్లు, దుప్పట్లు తెప్పించాం. మెష్‌లను ఏర్పాటు చేశాం. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా చూస్తున్నాం. డైట్ బిల్లులు సక్రమంగా జమయ్యాయి.

ప్ర: పదో తరగతి విద్యార్థులకు ఎలాంటి శిక్షణ ఇస్తున్నారు..?

జ: పదో తరగతి విద్యార్థులకు సంబంధించి ప్రతి వసతిగృహంలో స్టడీ అవర్స్‌ను ఏర్పాటు చేశాం. వారంలో ఒక రోజు ప్రత్యేక ట్రైనర్లతో సబ్జెక్టులను బోధిస్తున్నాం. ఎవరైనా విద్యార్థులు సబ్జెక్ట్‌లో వెనుకబడి ఉంటే వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నాం. ఈ ఏడాది ప్రతి విద్యార్థి పాసయ్యేలా సన్నద్ధం చేస్తున్నాం.

ప్ర: గురుకుల పాఠశాలల్లో ఫ్యాకల్టీ కొరతను ఎలా అధిగమిస్తారు?

జ: గురుకుల పాఠశాలల్లో ఇదివరకూ ఫ్యాకల్టీ కొరత ఉన్న మాట వాస్తవమే. అయితే పైస్థాయి అధికారుల అనుమతితో ప్రైవేట్ టీచర్లను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నాం.

ప్ర: గిరిజనులకు ఏ ఏ పథకాలు వర్తింపజేస్తున్నారు?

జ: ఇప్పటి వరకూ గిరిజనులకు సంబంధించిన అన్ని పథకాలు వర్తింపజేశాం. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే మరిన్ని పథకాలు వర్తింపజేయనుంది. ప్రస్తుతం 0-200 యూనిట్ల వరకూ కరెంటు బిల్లులు లేని పథకం అమలు అవుతోంది.

ప్ర: గిరిజనుల స్వయం ఉపాధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?


జ: గ్రామాల్లో చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులు ఉన్నారు. వారిలో యువతకు వారి చదువును బట్టి స్కిల్ డెవలప్‌మెంట్ కింద శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నేడు సమగ్రశిక్ష ఏఎస్పీడీ రాక

అనంతపురం విద్య, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్(ఏఎస్పీడీ) గురువారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఏఎస్పీడీ రవీంద్రనాథ్ జిల్లా పర్యటనలో భాగంగా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఉద్యోగులతో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తారు. తర్వాత జిల్లాలో కేజీబీవీ స్కూళ్లు, భవిత కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారు. స్కూళ్లలో మధ్యాహ్న భోజనం, అటెండెన్స్ తదితర అంశాలను పరిశీలించనున్నట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది.

వేరుశనగ రైతుకు మళ్లీ నష్టాలే. ఖరీఫ్‌లో అననుకూల వర్షాలతో పంట చేతికి రాలేదు. దీంతో చాలాచోట్ల రైతులు పంటను తొలగించుకున్నారు. రబీలోనూ నష్టాలు తప్పలేదు. వర్షాలు, మంచు ప్రభావంతో తేమ పెరిగి, మచ్చ తెగులు విపరీతంగా సోకాయి. దీంతో దిగుబడి దారుణంగా పడిపోయింది. సాధారణంగా 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు వచ్చే దిగుబడి ఈసారి 2 నుంచి 3 క్వింటాళ్లకే పరిమితమైంది. ధర కూడా అమాంతం పడిపోయింది. నెల క్రితం వరకు రూ.8 వేలు పలికిన క్వింటాల్ వేరుశనగ ధర.. ప్రస్తుతం రూ.5 వేలకు పడిపోయింది. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. తెగుళ్ల ప్రభావంతో వేరుశనగ కట్టె కూడా నల్లగా మారిపోయింది. దీంతో గ్రాసానికి కూడా పనికిరాదని రైతులు వాపోతున్నారు. -ఆంధ్రజ్యోతి, కళ్యాణదుర్గం

పెట్టుబడి కూడా వస్తుందో.. రాదో..



మూడెకరాల్లో వేరుశనగ సాగు చేశా. రూ.1.50 లక్ష వరకు పెట్టుబడి పెట్టా. తెగుళ్లు సోకి వేరుశనగ కట్టె నల్లగా మారిపోయింది. దిగుబడి తగ్గడమే కాకుండా, ధర కూడా అమాంతం పడిపోయింది. దీంతో పెట్టుబడి కూడా వస్తుందో.. రాదోనని.. ఆందోళన చెందుతున్నాం.

- జయన్న, రైతు, ఒంటారెడ్డిపల్లి


నల్లగా మారిన వేరుశనగ కట్టె

రబీలోనూ నష్టాలే..!

- పాతాళానికి ధరలు
- అమాంతం రూ.3 వేలు తగ్గిన వైనం
- అన్నదాత అప్పులపాలు

● వేరుశనగను దెబ్బతీసిన మచ్చ తెగులు ● దారుణంగా తగ్గిపోయిన దిగుబడి ● ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లే..

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్, బెళుగుప్ప మండలాల పరిధిలో 6 వేల హెక్టార్లకు పైబడి ఈసారి రబీలో విత్తన వేరుశనగ సాగు చేశారు. సెప్టెంబరులో పంట పెట్టారు. ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి కింద వెచ్చించారు. రెండు నెలల వరకు పంట బాగానే ఉంది. ఆ తరువాత పంట ఎదుగుదల లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. వర్షాలు, అధిక మంచు కారణంగా పంటకు మచ్చ తెగులు సోకాయి. దీంతో దిగుబడి తగ్గిపోయింది. వేరుశగన కట్టె నల్లగా మారిపోయి, కాయలన్నీ భూమిలోపలికి కుచించుకుపోయాయి. ఎన్నిసార్లు మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్టుకు 5 నుంచి 10 కాయలు మాత్రమే దిగుబడి వచ్చింది. కొన్ని చెట్లలో కాయలే కనిపించని దుస్థితి. సాధారణంగా ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈసారి తెగుళ్ల ప్రభావంతో 2 నుంచి మూడు క్వింటాళ్ల మాత్రమే దిగుబడి దక్కవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

అమాంతం పడిపోయిన ధర

విత్తన వేరుశనగ క్వింటాల్ ధర నెలరోజుల క్రితం రూ.8 వేలు ఉండేది. ప్రస్తుతం రూ.5వేలు పలుకుతోంది. అమాంతం రూ.3 వేలు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడిలేని సమయంలో ధర కూడా పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కర్ణాటకలోని చెళ్లికెరకు తీసుకెళ్లి విత్తన వేరుశనగను అమ్ముతున్నారు. అక్కడ కూడా ధర దక్కక రైతు డీలా పడిపోయాడు. ప్రస్తుత ధరల ప్రకారం ఎకరాలో దిగుబడి విక్రయిస్తే రూ.15 వేలు కూడా రావట్లేదు. పెట్టుబడి మాత్రం రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టారు. దీంతో భారీగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.




పొలంలోనే నల్లగా మారిన వేరుశనగ కట్టె

చెట్టుకు 5 నుంచి 8 కాయలే..



రబీలో నాకున్న మూడెకరాల్లో వేరుశనగ సాగు చేశా. రెండు నెలలపాటు పంట ఎదుగుదల బాగానే ఉంది. ఆ తరువాత తెగుళ్లు సోకాయి. వేరుశనగ చెట్టంతా నల్లగా మారిపోయి, పూర్తిగా దిగుబడి పడిపోయింది. కోత కోయడంతో చెట్టుకు 5 నుంచి 8 కాయలు మాత్రమే ఉన్నాయి. దీంతో పెట్టుబడి కూడా వస్తుందో.. రాదో.. తెలియదు. వేరుశనట కట్టె కూడా నల్లగా మారిపోవడంతో పశువులకు మేతగా పనికిరాదు.

- హనుమంతరాయుడు, రైతు, జెల్లిపల్లి

తేమశాతం ఎక్కువ కావడంతోనే ...

రబీలో సాగు చేసిన వేరుశనగ పంటకు ఎక్కువగా మచ్చతెగులు సోకడానికి ప్రధాన కారణం తేమశాతం ఎక్కువ కావడమే. సరైన సమయంలో తగిన మోతాదులోనే వేరుశనగకు నీరు వదలాలి. ఇష్టారాజ్యంగా ఇస్తే తెగులు ఉధృతంగా వ్యాపిస్తాయి. కాండం, మొదలు ఎండుకుపోయి, ఆకు రాలిపోతుంది. తద్వారా వేరుశనగ దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశాలుంటాయి.

- యల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం

నేటి నుంచి జకినీ మాత ఉత్సవాలు


సునామ జకినీమాత


మల్క్యామ జకినీ మాత

గుత్తి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అరె కటికల ఆరాధ్య దేవతలైన సునామ జకినీమాత, మల్క్యామ మాత జాతర ఉత్సవాలను గురువారం నుంచి నిర్వహించనున్నారు. గుత్తి ఆర్ఎస్ రోడ్డులో వెలసిన సునామ జకినీ మాత ఆలయంలో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్కారి ఆలూరు లక్ష్మణ్‌రావు, ధర్మకర్త సురేష్‌రావు తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు ఉత్సవాలకు హాజరవుతారన్నారు. వచ్చే భక్తులకు తాగునీరు, భోజన సౌకర్యం కల్పించను న్నట్లు వారు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం తెల్లవారుజామున అమ్మవార్లకు అభిషేకం, హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను స్థానిక సాయిబాబా దేవాలయం నుంచి అమ్మవారి దేవాలయం వరకు కన్యలు, ముత్తైదువులు పూర్ణకుంభాలతో ఊరేగింపు, పూర్ణ కళశాలతో అభిషేకం కార్యక్రమాలు చేస్తామన్నారు. భక్తులచే అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, రాత్రి చిన్నారులచే నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుక్రవారం తెల్లవారుజామున అమ్మవార్లకు పంచామృతం, సుగంధ ద్రవ్య పసుపు కుంకుమలతో ప్రత్యేక అభిషేకం, భక్తులచే సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. ఉదయం 7గంటలకు అమ్మవార్లకు గంగాస్నానం, గుత్తి ఆర్ఎస్ రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి కన్యలచే పూర్ణకుంభాలతో అమ్మవారి దేవాలయం వరకు ఊరేగింపు, అనంతరం అమ్మవార్లకు పాలాభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం అమ్మవారి లడ్డూ వేలం నిర్వహిస్తామన్నారు. వివిధ రాష్ట్రాల అరె కటిక కుల సంఘాలు, ప్రజాప్రతినిధులతో సభా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు లక్ష దీపారాధన నిర్వహిస్తామని వారు తెలిపారు.


భోజన సౌకర్యాలను పరిశీలిస్తున్న కమిటీ నిర్వాహకులు

ఫార్మసీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఓటీపీఆర్ఐలో బీఫార్మసీ, ఫార్మా-డి కోర్సులకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ సురేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈఏపీసెట్ ద్వారా కన్వీనర్ కోటాలో ఇప్పటికే ప్రవేశాలు జరిగాయన్నారు. మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేస్తున్నామన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులై, ఈఏపీసెట్ బైపీసీ స్ట్రీమింగ్‌లో అర్హత సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఇప్పటి వరకు ఎక్కడా అడ్మిషన్ పొంది ఉండకూడదన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వారు ఫీజు రీయింబర్స్‌కు అనర్హులని పేర్కొన్నారు. ఈనెల 6,7 తేదీల్లో జేఎన్టీయూ పరిపాలనా భవనంలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్స్‌కు ఆసక్తిగల విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కోత

గుంతకల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో గుంతకల్లు రైల్వే డివిజన్ కొంతమేర కోతకు గురైంది. ఈ డివిజన్‌లోని రాయచూరు-నాల్వార్ రైల్వే సెక్షన్‌ను సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లోకి (సౌత్ సెంట్రల్) మారుస్తూ కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులను జారీచేసింది. రాయచూరు-నాల్వార్ సెక్షన్‌కు గుంతకల్లు డివిజన్‌లో 107.58 కి.మీ. లైన్, 12 రైల్వే స్టేషన్లు ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్ నుంచి సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి గుంతకల్లు రైల్వే డివిజన్ మారనున్న నేపథ్యంలో పరిపాలన, నిర్వహణ సౌలభ్యం కోసం రాయచూరు-నాల్వార్ మార్గాన్ని ఎస్‌సీ రైల్వేలోకి మార్చాలని నిర్ణయించారు. గతంలో గుంటూరు రైల్వే డివిజన్, హుబ్లీ డివిజన్ల ఏర్పాటు సందర్భంగా కూడా గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కోత వేశారు. పలు రైల్వే సెక్షన్లను ఆ డివిజన్లలోకి మార్చారు. గుంతకల్లు రైల్వే డివిజన్ సౌత్ సెంట్రల్ రైల్వేలో ఉన్నప్పుడు సికింద్రాబాద్, విజయవాడ తర్వాత పెద్ద విస్తీర్ణం కలిగిన మూడో డివిజన్‌గా ఉండేది. ప్రస్తుతం సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి మారినందున విజయవాడ తర్వాత రెండో పెద్ద డివిజన్‌గా మారింది. రాయచూరు-వాడి రైల్వే సెక్షన్‌లో రెండు పవర్ జనరేషన్ ప్లాంట్లు ఉన్నందున బొగ్గు రవాణాకు ఈ సెక్షన్ మూడు రైల్వే జోన్‌లకు అత్యంత కీలకంగా మారనుంది. ఈ కారణంగా మధ్య రైల్వే, దక్షిణ మధ్య రైల్వే, దక్షిణ కోస్తా రైల్వే జోన్లలో వాడి జంక్షన్ అత్యంత కీలకం కానుంది. పరిపాలన, నిర్వహణ సౌలభ్యం కోసం వాడి జంక్షన్‌ను క్రూ చేంజింగ్ పాయింట్‌గా రైల్వేశాఖ గుర్తించింది.

ఇక సౌత్ కోస్టు రైల్వే జోన్‌లోకి..



గుంతకల్లు రైల్వే స్టేషన్

లాభాలూ ఉన్నాయ్..

జోన్ మార్పు కారణంగా గుంతకల్లు రైల్వే డివిజన్ కుదింపునకు గురైంది. ఆదాయ పరంగా నష్టం, జోనల్ కేంద్రం దూరంగా ఉండటం ఇబ్బందికరమే అయినా, కొన్ని ఉపయోగాలు ఉన్నాయి. సౌత్ కోస్టు రైల్వే జోన్ ఏర్పాటు వల్ల విశాఖపట్టణం-విజయవాడ-గుంతకల్లు రైల్వే డివిజన్ల మధ్య కనెక్టివిటీ, ట్రాఫిక్ పెరుగుతుంది. దీని వల్ల రాష్ట్ర రాజధానికి రైళ్లు లేక ఇబ్బందిపడుతున్న గుంతకల్లు రైల్వే డివిజన్ ప్రయాణికులకు, ముఖ్యంగా రాయలసీమ ప్రజలకు మేలు జరగనుంది. రాష్ట్ర రాజధానికి వెళ్లేందుకు అమరావతి, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మినహా డెయిలీ ఎక్స్‌ప్రెస్‌లు లేక ఇబ్బందులు పడుతున్న సీమ ప్రజలకు కష్టాలు తీరే అవకాశాలు ఉన్నాయి. గతంలో రద్దయిన యశ్వంతపూర్-విజయవాడ ప్యాసింజరుతోపాటు, మరిన్ని రైళ్లు వచ్చే పరిస్థితులు ఏర్పడుతాయి.

936 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 467 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 600 బుధవారం టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 21,120 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4,200, సరాసరి రూ.11వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 32 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభ మేళాకు గుంతకల్లు డివిజన్ మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న తిరుపతి-దానాపూర్ ప్రత్యేక రైలు (నం. 07117) రాత్రి 11-45 గంటలకు తిరుపతిలో బయలుదేరి రెండు రోజుల తర్వాత 16వ తేదీ రాత్రి 11-55 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07118) ఈ నెల 17న దానాపూర్‌లో మధ్యాహ్నం 3-15 గంటలకు బయలుదేరి 19వ తేదీ మధ్యాహ్నం 1-55 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని వివరించారు. ఈ రైలు రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు, గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్, కాచిగూడ, మల్కాజ్‌గిరి, చర్లపల్లి, ఖాజీపేట్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బాలార్షా, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగపూర్, ఇటార్సి, పిప్రియా, జబల్పూర్, కట్నీ, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగరాజ్ చౌకీ, మీర్జాపూర్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సర్, అర స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. అలాగే తిరుపతి-దానాపూర్ ప్రత్యేక రైలు (నం. 07119) ఈ నెల 18వ తేదీ రాత్రి 11-45 గంటలకు తిరుపతిలో బయలుదేరి 20వ తేదీ రాత్రి 11-55 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07120) ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3-15 గంటలకు దానాపూర్‌లో బయలుదేరి 23వ తేదీ మధ్యాహ్నం 1-45 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు. ఈ రైలు రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, సూళేహళ్లి, సేడం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, చర్లపల్లి, ఖాజీపేట్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బాలార్షా, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగపూర్, ఇటార్సి, పిప్రియా, జబల్పూర్, కట్నీ, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగరాజ్ చౌకీ, మీర్జాపూర్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సర్, అర స్టేషన్ల మీదుగా వెళుతుందని వెల్లడించారు.

చేనేతకు పూర్వ వైభవం

- లోకేశ్ చొరవతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు
- మంత్రి సవిత


దుస్తులు కుడుతున్న మంత్రి సవిత

హిందూపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్వీర్యమైన చేనేత రంగానికి పూర్వవైభవం తెస్తానని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. బుధవారం హిందూపురం పట్టణ పరిధిలోని తెలుగు చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవతో హిందూపురం నియోజకవర్గంలో 3వేల కుటుంబాలకు ఉచిత జాకార్డ్‌లు మంజూరు చేశామని తెలిపారు. వైసీపీ హయాంలో చేనేతలు తయారు చేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధర లేక చాలా మంది వృత్తికి దూరమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం చేనేతలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో చేనేతలు అధిక సంఖ్యలో ఉన్నారని అన్నారు. దీంతో వారి సమస్యలు దగ్గరగా చూశాక ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. 1989లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు హిందూపురంలో తెలుగు చేనేత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారని వివరించారు. శిక్షణ పొందిన 65 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా మిషన్ కుట్టారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, స్కిల్ డెవలప్‌మెంట్ ఏడీ హరిక్రిష్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, టీడీపీ మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రైతులు, కంపెనీలకు వారధిగా..

ఆకట్టుకున్న అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ స్టాల్స్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ కార్యక్రమం రైతులు, కంపెనీలకు వారధిగా నిలిచింది. కార్యక్రమంలో వివిధ పంటలకు సంబంధించిన ఫర్టిలైజర్లు, మిషనరీలు, డ్రోన్ స్ప్రేయర్స్, డ్రిప్, కొత్త రకాల పండ్ల వంగడాలు ప్రదర్శించారు. సాధారణ మందుల వాడకాలకు భిన్నంగా సాంకేతిక సాగులో మెలకువలు, అగ్రికల్చర్ యాప్‌లతో పంటలు సాగుచేసే విధానాలు గురించి పలు కంపెనీ ప్రతినిధులు రైతులకు వివరించారు. కాంక్లేవ్ స్టాల్స్ ప్రతినిధులు, రైతుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

రైతులు ఆసక్తి చూపారు



అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ ప్రోగ్రామ్‌లో మా కంపెనీ తరఫున పలు రకాల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్‌ను స్టాల్‌లో ఉంచాం. మా కంపెనీ మందులు, ఉపయోగాలు, ఎలా సాగు చేయాలన్న అంశాలపై రైతులకు వివరించాం. ఇందులో ప్రత్యేకంగా సాన్‌మ్యాక్స్ ఎనర్జీ ప్రొడక్ట్, పోషక్ సూపర్‌స్టార్ ప్రొడక్ట్‌లపై ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపారు. దాదాపు 30 మంది రైతులు వీటి గురించి తెలుసుకున్నారు. దాదాపు 10 మంది రైతుల వరకూ ఆ ప్రొడక్ట్ మాకు కావాలని మా కంపెనీ డీటైల్స్ తీసుకెళ్లారు. కాంక్లేవ్‌లో స్టాల్స్ ఏర్పాటుతో బిజినెస్‌తో పాటు.. వివిధ రకాల రైతులకు మందుల గురించి వివరించే అవకాశం కలిగింది.

- శివగోపాల్, స్టోర్ మేనేజర్, సాన్‌న్యూట్రీ స్టార్

ధరలు తగ్గిస్తే మేలు



కాంక్లేవ్ ప్రోగ్రాం గురించి విని గుంతకల్లు నుంచి వచ్చాను. నాకు ఐదెకరాల పొలం ఉంది. నాలుగు ఎకరాల్లో మునగ, ఒక ఎకరంలో కంది పంట సాగు చేశా. పంటకు మచ్చ ఉంది. అందుకోసమే స్టాల్స్‌ను పరిశీలించా. నేను సాధారణంగా తీసుకునే ఫర్టిలైజర్స్ మందుల కన్నా.. కొత్త కొత్త కంపెనీలు ఉన్నాయి. అదే విధంగా నా పంటకు సంబంధించి మిషనరీ అవసరముంది. అయితే స్టాల్స్‌లో మిషనరీ ఐటమ్స్ కనిపించలేదు. పురుగు మందుల వాటి గురించి బాగానే చెప్పారు. కానీ ధరలు కొంచెం ఎక్కువగా ఉన్నాయి. మాలాంటి వారిని దృష్టిలో ఉంచుకొని ధరల విషయంలో కంపెనీలు దిగొస్తే బాగుంటుంది.

-జగన్నాథ్, రైతు, వెంకటాంపల్లి, గుంతకల్లు నియోజకవర్గం

మందులు కొనుగోలు చేశా..



నేను కంబదూరులో 12 ఎకరాల భూమిని లీజుకు తీసుకున్నా. 6 ఎకరాల్లో చిక్కుడు పంటను సాగు చేస్తున్నా. స్టాల్స్‌లో పలు రకాల ఎరువులు, పురుగుల మందులకు సంబంధించిన పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ ఏర్పాటు చేశారు. చాలా బాగుంది. ఎన్నో డబ్బులు ఖర్చు పెట్టుకొని అనంతపురం, ఒక్కొక్కసారి బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లి మందులు కొనుగోలు చేసేవాణ్ణి. అయినా కొన్నిసార్లు పనిచేసేవి కావు. కానీ ఈ స్టాల్స్‌లో కొత్త కంపెనీలు ఫర్టిలైజర్స్‌ను చూపించారు. ఇందులో సాన్‌మ్యాక్స్ ఎనర్జీ ప్రొడక్ట్ వాడకంపై వివరించారు. పూత గ్రోతింగ్, మొగ్గ, దిగుబడి విషయంలో ఈ మందు బాగా పనిచేస్తుందని చెప్పారు. ధర కూడా రీజనబుల్‌గా ఉంది. అందుకే పంటకు కావాల్సిన మందులు కొనుగోలు చేశాను.

- రాఘవేంద్ర, రైతు, కంబదూరు

ఆన్‌లైన్‌లో అవగాహన



డిజిటల్ గ్రీన్‌తో రైతులకు అవగాహన కల్పించి, మెలకువలు అందించేందుకు హార్టికల్చర్ శాఖ అనుసంధానంతో నూతన ప్రయత్నాలు చేస్తున్నాం. అందులో భాగంగా ఇప్పటికే 10 నిమిషాల నిడివితో లఘుచిత్రాలు రూపొందించి రైతులకు చూపించి అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా మిరప, టమోటా, పసుపు పంటల సాగు, మెలకువలు తదితర అంశాలపై ఐవీఆర్(ఇంటరాక్ట్ వాయిస్ రికార్డ్ సిస్టమ్)తో అవగాహన కల్పిస్తున్నాం. స్టాల్స్‌లో పంట నాణ్యతను రూపొందించే మిషనరీతో అవగాహన కల్పించాం. దాదాపు 100 మందికిపైగా రైతులు వారి మొబైల్ నెంబర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారందరికి పంట పద్ధతులు, మెలవకులు, సాగు విధానా లపై ఐవీఆర్ ద్వారా, లఘుచిత్రాల ద్వారా అవగాహన కల్పిస్తాం.

- మస్తాన్‌వలి, ప్రోగ్రామ్ మేనేజర్

మొక్కలు కొనుగోలు చేశారు



నేను రైతులకు కొత్త వంగడాలను పరిచయం చేయాలనే ఉద్దేశ్యంతో నర్సరీని స్థాపించా. కడపలో నర్సరీ ఏర్పాటు చేసుకొని చీనీ పంటలో అత్యంత దిగుబడి వచ్చే పంటపై సెర్చ్ చేశా. అందులో భాగంగా బ్రెజీలియన్, మాండరిన్ ఆరెంజ్ మొక్కలను నర్సరీలో ఉంచా. వీటితో పాటు పనస వంగడాన్ని రైతులకు పరిచయం చేసే ప్రయత్నం చేస్తున్నా. అందులో భాగంగా ఈ హార్టికల్చర్ కాంక్లేవ్ మీటింగ్‌లో స్టాల్ ఏర్పాటు చేశా. మినిమమ్ సీడ్‌లెస్‌తో ఉండే బ్రెజీలియన్ మొక్క ధర రూ. 100లు, మాండరిన్ మొక్క ధర రూ. 250లు ఉంది. ఈ మొక్కలు ఐదు దశల్లో పంట ఇస్తాయి. దాదాపు 20 మంది రైతులు మొక్కలను కొనుగోలు చేశారు. పనస పండుకు సంబంధించి ఒక్కో మొక్క ధర రూ. 600లు ఉంది. ధర ఎక్కువ ఉండటంతో రైతులు వెనుకడుగు వేస్తున్నారు. 9 నెలల్లో చేతికొచ్చే ఈ పంటపై దృష్టి సారిస్తే అధిక లాభాలు గడించవచ్చు.

- సంతోష్‌రెడ్డి, సంతోష్ చీనీ నర్సరీ, బోనాలగ్రామం, కడప జిల్లా

డ్రిప్‌కు స్పందన



ప్రస్తుతం డ్రిప్ ప్రతి రైతుకు అత్యవసరం. మా కంపెనీని హార్టికల్చర్ శాఖ కు అనుసంధానించి ముందుకు వెళ్తున్నాం. స్టాల్స్‌లో డ్రిప్‌కు సంబంధించి పరికరాలు తీసుకొచ్చాం. చాలా మంది రైతులు వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇందులో 5 ఎకరాలకు డ్రిప్‌నకు 90 శాతం వరకూ ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. పదెకరాలకు 70 శాతం సబ్సిడీ ఇస్తోంది. మిగిలిన రైతులు భరించాల్సి ఉంటుంది. దాదాపు 30 నుంచి 40 మంది రైతులు డ్రిప్ కావాలని అడిగి వెళ్లారు.

- భాస్కర్, డీసీఓ, నాథలిన్ ఇరిగేషన్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్

డ్రోన్ స్ప్రేయర్‌తో సులభంగా పిచికారీ



డ్రోన్ స్ప్రేయర్ ద్వారా మొక్కలకు పురుగుమందుల పిచికారి సులభతరమవుతుంది. ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో కాంక్లేవ్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాం. ఈ డ్రోన్ స్ప్రేయర్‌లో 10 లీటర్ల కెపాసిటీ ట్యాంకు ఉంటుంది. ఒక ఎకరాకు 10 లీటర్లు స్ప్రే చేస్తే... రూ. 300లు చార్జ్ చేస్తాం. ఇదీ ముఖ్యంగా వేరుశనగ, టమోటా, కళింగర, అరటి తదితర పంటలకు ఉపయోగిస్తారు. దాదాపు 20 మంది రైతులు ఈ డ్రోన్ స్ప్రేయర్ కావాలని ఫోన్ నెంబర్లు ఇచ్చారు. అలాగే స్టాల్స్ న్యూట్రన్, మిరాక్ కంపెనీల పెస్టిసైడ్స్‌ను తీసుకొచ్చాం.

- మణికళ్యాణ్, ఏరియా మేనేజర్, ఇఫ్కో కంపెనీ



పరికరాలు గురించి వివరిస్తున్న స్టాల్ నిర్వాహకుడు



స్టాల్స్ నిర్వాహకుడికి కలెక్టర్ సూచనలు



ఎంత కళాత్మకంగా ఉందో..

హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో ఉన్నారని అన్నారు. జిల్లాలో పండించే ఉద్యాన పంటల నాణ్యంగా, రుచిగా ఉంటాయని, ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయని అన్నారు. ఉరవకొండలో సామూహిక ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా 50వేల ఎకరాలకు టీడీపీ హయాంలో నీరు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. వైసీపీ హయంలో ఆ ప్రాజెక్టును గాలికి వదిలేశారని విమర్శించారు. త్వరలోనే ఆ ప్రాజెక్టును పునఃప్రారంభిస్తామని అన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను సీఎం త్వరలోనే ప్రారంభిస్తారని అన్నారు. తమది రైతు పక్షపాతి ప్రభుత్వమని, రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని అన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో వినిపించాలి: కాలవ



అనంత బ్రాండ్ అంతర్జాతీయ స్థాయిలో వినిపించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. దశాబ్దాలుగా అనంత ఉద్యాన పంటలకు ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. సీఎం చంద్రబాబు ఆశీస్సులతో రైతులు అనేక రకాల ఉద్యాన పంటలు పండిస్తున్నారని అన్నారు. మన ప్రాంతంలో పండించిన ఉద్యాన ఉత్పత్తులను జాతీయ మార్కెట్‌లో ఎక్కువ ధరతో కొంటున్నారని అన్నారు. ద్రాక్ష, నిమ్మ, చీనీ దిగుబడులు జాతీయ స్థాయిలో ప్రసిద్ధి పొందాయని అన్నారు. అరటి, బొప్పాయి ఇటీవల పెద్ద ఎత్తున ఉత్పత్తి అవుతోందని అన్నారు. నాణ్యత పరంగా ప్రత్యేక ముద్ర వేసుకున్న జిల్లా ఉద్యాన ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు లభించేలా కృషి చేయాలని అన్నారు. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు.

రైతులను ఆదుకుంటాం: టీజీ భరత్



అనంత ఉద్యాన రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్ అన్నారు. అనంత ఉద్యాన సమ్మేళనంలో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. ఈ సమ్మేళనం రైతులకు మరింత ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ప్రోత్సహకాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

బంగారం పండిస్తారు : పరిటాల సునీత



నీరు ఉంటే బంగారం పండించే రైతులు జిల్లాలో ఉన్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి చీనీ, దానిమ్మ, ద్రాక్ష, బొప్పాయి, సీతాఫలం, టమోటా తదితర ఉద్యాన పంటలు పండిస్తున్నారని అన్నారు. కానీ మార్కెటింగ్ సౌకర్యం లేక నష్టపోతున్నారని అన్నారు. మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే రైతుల ఆదాయం పెరుగుతుందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. పదెకరాల వరకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. కాంక్లేవ్‌లోని పంటల జాబితాలో దానిమ్మ, సీతాఫలం ఉత్పత్తులను చేర్చాలని కోరారు.

జీవీఏపై అవగాహన పెరగాలి: రాజశేఖర్




రైతులకు ఉత్పత్తికి జోడించిన విలువ (జీవీఏ) గురించి తెలియజేయాలని వ్యవసాయ, అనుబంధ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ సూచించారు. ఒకటి నుంచి రెండు శాతం జీవీఏ పెంచితే రైతుల ఆదాయం పెరుగుతుందని అన్నారు. జిల్లా యంత్రాంగం ప్రతి సమావేశాల్లో జీవీఏ లెక్కలను రైతులకు చెబుతూ ఉంటే ప్రతి ఒక్కరికీ తెలుస్తుందని అన్నారు. అనంతను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని అన్నారు. దేశంలోనే అరటి, చీనీ ఉత్పత్తుల్లో ఏపీ మొదటి స్థానంలో ఉందని అన్నారు. కోత తర్వాత నష్టాన్ని తగ్గించుకుంటే మరింత ఆదాయం వస్తుందని అన్నారు. ఉద్యాన దిగుబడులను అమ్ముకోవడంతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్‌కు అలవాటు పడితే మరింత ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహిస్తామని అన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకురాడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయండి: అమిలినేని



కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 30 వేల ఎకరాల్లో టమోటా పంట సాగుచేస్తున్నారని, టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని, చింత పండు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గ స్థాయిలోనూ స్టాల్స్ ఏర్పాటు చేసి, రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

అరటి ఎగుమతికి కృషి : అంబికా



జిల్లా నుంచి లక్ష టన్నుల అరటిని ఎగుమతి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. జిల్లా రైతులు కష్టపడి పని చేసి, ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారని, ఉద్యాన పరిశ్రమను దేశ వ్యాప్తంగా విస్తరించే ప్రయత్నం చేస్తున్నారని కొనియాడారు. జిల్లాలో హార్టికల్చర్ ఎయిర్ పోర్టును ఏర్పాటు చేసి, దేశంలోని వివిధ నగరాలకు వీలైనంత త్వరగా ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేసే అవకాశం కల్పిస్తామని, గిట్టుబాటు ధర కల్పిస్తామని అన్నారు.

ధరలు తగ్గకుండా చూడాలి : జేసీ ప్రభాకర్‌రెడ్డి



తాడిపత్రి ప్రాంతంలో అరటి పంటను టిష్యూ కల్చర్ ద్వారా సాగు చేస్తున్నారని, అరటి ధరలు తగ్గకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. సీఎం చంద్రబాబు చొరవతో గల్ఫ్ దేశాలకు అరటి ఎగుమతి అవుతోందని, దీంతో ధరలు పెరిగాయని అన్నారు. అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. కలెక్టర్‌ను ఆయన అభినందించారు.

గిట్టుబాటు ధర కల్పించాలి : జయరాం



టమోటా రైతుకు గిట్టుబాటు కల్పించి ఆదుకోవాలని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కోరారు. 2014-19 కాలంలో సీఎం చంద్రబాబు డ్రిప్ పరికరాలు అందజేసి ఆదుకున్నారన్నారని అన్నారు. ప్రస్తుతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింకర్లను అందించే చర్యలు చేపడుతున్నారని అన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌ను ప్రోత్సహిస్తాం: శేఖర్‌బాబు



జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ శేఖర్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని తీసుకువచ్చిందని తెలిపారు. అందులో పెట్టుబడులు పెట్టేవారికి ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు ప్రకటించిందని అన్నారు. డీ హైడ్రేషన్ యూనిట్లను అపరిమితంగా మంజూరు చేస్తామని అన్నారు. 040 - 45901100 నంబర్‌ను కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.



స్టాల్స్‌లో వివిధ రకాల ఫలాలు

ఎంఓయూలు కుదుర్చుకున్న ఏడు కంపెనీలు



అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలతో మంత్రి, కలెక్టర్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అనంత ఉద్యాన సమ్మేళనంలో 7 కంపెనీలు జిల్లా యంత్రాంగంలో అవగాహన ఒప్పందా(ఎంఓయూ)లను కుదుర్చుకున్నాయి. మైక్రో అల్గే సొల్యూషన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ (స్పెయిన్‌కు చెందిన ఆల్గే ఎనర్జీ అనుబంధ సంస్థ), సిద్దార్థ కోల్డ్ కేర్ (అనంతపురం), కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ (కృష్ణా జిల్లా), గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్ (తెలంగాణ), అగ్రో లైఫ్ సైన్స్ కార్పొరేషన్ (న్యూఢిల్లీ), అననా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్, ప్యూర్ ఓ న్యాచురల్ రీటైల్ ప్రైవేటు లిమిటెడ్ (హైదరాబాద్) కంపెనీలు ఉద్యాన పంట ఉత్పత్తుల కొనుగోలు, ఎగుమతికి సంబంధించి మంత్రి పయ్యావుల కేశవ్ సమక్షంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. ఆయా కంపెనీల ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు.

మైక్రో అల్గే సొల్యూషన్స్

ఈ కంపెనీ బయో ఎరువులు, బయో ఉద్దీపనల కోసం ఆధునాతన మైక్రో అల్గే ఆధారిత సాంకేతికతను సమకూర్చనుంది. జిల్లాలో కనీసం 10వేల మంది రైతులు మైక్రో అల్గే ఆధారిత బయో ఎరువులు, జీవ ఉద్దీపనలను స్వీకరించేలా చొరవ చూపుతుంది. యూపీటీ ఆధారిత బయో ఇన్‌పుట్‌ల సామర్థ్యాన్ని పెంచేందుకు పైలెట్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తారు.

సిద్ధార్థ కోల్డ్ కేర్

ఈ కంపెనీ పరిధిలో 300 ఎంటీ ప్రీ కూలింగ్ చాంబర్లు, 800 ఎంటీ కోల్డ్ రూమ్‌లు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం ఎస్‌కే బనానాను ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు వీలుగా ప్రీ కూల్ చేస్తున్నారు. ఒప్పందం మేరకు సిద్దార్థ పల్ప్, డీ హైడ్రేషన్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తారు. తద్వారా పండ్లు, కూరగాయలు తాజాగా ఉండేలా చర్యలు తీసుకుంటారు.

కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్

అరటి, మామిడి, సీతాఫలం, ఇతర ఉద్యాన పంటలను ప్రాసెసింగ్ చేస్తారు. తద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తులను లాభదాయకమైన ధరతో విక్రయించేలా చొరవ చూపుతారు.

గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్

ఉద్యాన పంట కోతల అనంతరం తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. జిల్లా రైతులకు మద్దతు ధర కల్పిస్తారు. ఇతర ప్రాంతాల్లో ధరలను రైతులకు తెలియజేస్తారు. తద్వారా మెరుగైన ధర దక్కేలా చొరవ చూపుతారు.

అగ్రో లైఫ్ సైన్స్ కార్పొరేషన్

ఉద్యాన పంటల్లో మొక్కల ఎదుగుదల కోసం బయో ఎరువులను రైతులకు అందుబాటులోకి తెస్తారు. జిల్లాలోని 13 సంకల్ప్ రీటైల్ స్టోర్ల ద్వారా తక్కువ ధరకు ఎరువులను అందజేస్తారు.

బనానా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్

అరటి పంట కోత తర్వాత వ్యర్థాలను తగ్గించేందుకు చర్యలు చేపడతారు. అరటి నార నుంచి వస్త్రాలను తయారు చేయడంతోపాటు అందుకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ప్యూర్ ఓ న్యాచురల్ రీటైల్ ప్రైవేటు లిమిటెడ్

రైతుల నుంచి నేరుగా పంట ఉత్పతులను కొనుగోలు చేస్తారు. స్థానిక వ్యవసాయ సంఘాలతో మమేకమై తాజా పండ్లు, కూరగాయలను సేకరిస్తారు.

డబ్బులు ఇవ్వలేదని తల్లిపై దాడి

చికిత్స పొందుతూ మృతి



కృష్ణమ్మ(ఫైల్)

కొత్తచెరువు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు అడిగిన డబ్బు ఇవ్వలేదని కన్నతల్లినే కడతేర్చాడు. ఈ సంఘటన మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన అమర్‌దీప్ భార్య వదిలేయడంతో పనీపాట లేకుండా జులాయిగా తిరుగుతుండేవాడు. ఈక్రమంలోనే తన వ్యసనాలకు తల్లి అయిన బెల్లం కృష్ణమ్మ(68)ను ఈ నెల మూడో తేదీ డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో తీవ్ర ఆగ్రహంతో కట్టెతో తలపై మోదాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు, బంధువులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ ఇందిర తెలిపారు. మృతురాలి కుమార్తె అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలో పట్టుకుంటామని ఆమె తెలిపారు.

ఆన్‌లైన్ మోసం

రూ.లక్షకు పైగా పోగొట్టుకున్న మహిళ

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాడి వలలో చిక్కిన ఓ మహిళ రూ.లక్షకు పైగా పోగొట్టుకున్న సంఘటన మండలంలోని ఓబుళంపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు...రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లికి చెందిన ఓ మహిళ ఇటీవల పుట్టినిల్లు అయిన ఓబుళంపల్లికి వచ్చింది. ఈనెల రెండో తేదీన ఆ మహిళ సెల్‌ఫోన్‌కు ఒక గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. 'ఆరోగ్యశ్రీ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాను, మీనాన్నకు ఆరోగ్యశ్రీ కింద రెండేళ్ల కిందట శస్త్రచికిత్స జరిగింది. దానికి సంబంధించి రూ.40వేలు ప్రభుత్వం నుంచి బిల్లు పెండింగ్‌లో ఉంది. ఆ మొత్తాన్ని ఇప్పుడు మీ బ్యాంకు ఖాతాలోకి జమచేస్తాను. అందుకోసం మీ సెల్‌ఫోన్‌కు ఒక లింకు పంపిస్తున్నాను. ఓపెన్ చేసి లింక్‌పై క్లిక్ చేయండి' అని ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి చెప్పాడు. ఇదంతా నిజమేనని నమ్మిన ఆ మహిళ తనకు వచ్చిన లింకుపై క్లిక్ చేసింది. వెంటనే రూ.47,287 బ్యాంకు ఖాతా నుంచి కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. డబ్బు పోయిన విషయాన్ని ఆమె వెంటనే ఆ గుర్తు తెలియని వ్యక్తి దృష్టికి తీసుకెళ్లగా ఏదో సమస్య ఉన్నట్టు ఉంది. మరోసారి లింకు పంపిస్తాను క్లిక్ చేస్తే పెండింగ్‌లో ఉన్న బిల్లు, ఇప్పుడు పోయిన మొత్తం అంతా కలిపి జమవుతుందని తెలిపాడు. దీంతో ఆమె మళ్లీ లింక్‌ను క్లిక్ చేసింది. రెండోసారి రూ.40వేలు కట్ అయినట్లు మళ్లీ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ మహిళ మళ్లీ ప్రశ్నించగా ఇదొక సారి లింకు పంపిస్తాను క్లిక్ చేయమని చెప్పడంతో ఆ మహిళ నమ్మి క్లిక్ చేసింది. దీంతో రూ.17500 నగదు మాయమైంది. మూడు విడతల్లో మొత్తం రూ.1.04లక్షలు పోగొట్టుకుంది. వెంటనే తనకు వచ్చిన నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి 1903 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి జరిగిన ఆన్‌లైన్ మోసం తెలిపింది. బాధితు రాలు మంగళవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పది విద్యార్థిని ప్రసవం

యువకుడిపై పోక్సో కేసు

ధర్మవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థిని ప్రసవించడం పట్టణంలో కలకలం రేపింది. ఓ యువకుడు మాయమాటలు చెప్పి, బాలికను లోబరచుకున్నట్లు తెలిసింది. విద్యార్థిని బుధవారం ప్రసవించడంతో వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు...పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. బాలిక ఈనెల 4న పాఠశాలలో ఉండగా కడుపు నొప్పి వచ్చింది. దీంతో హెచ్‌ఎం.. బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు పాఠశాలకు వచ్చి కుమార్తెను ఇంటికి పిలుచుకెళ్లారు. బుధవారం కూడా కడుపు నొప్పి తగ్గకపోవడంతో తల్లిదండ్రులు స్థానిక ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షించి, బాలిక గర్భవతి అని తెలిపారు. అనంతరం బాలికకు వైద్యులు సాధారణ డెలివరీ చేయగా.. మగబిడ్డ జన్మించింది. బాలిక గర్భం దాల్చడానికి కారణం ఎవరని తల్లిదండ్రులు, పోలీసులు ఆరాతీయగా.. దుర్గానగర్‌కు చెందిన శ్రీనివాసులు కారణమని తెలిసింది. అతడు ప్రేమ పేరుతో బాలికను లోబరుచుకున్నట్లు బాలిక తెలిపింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

కార్మిక చట్టాల కుదింపుపై నిరసన



ధర్మవరం : నిరసన తెలుపుతున్న నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికచట్టాలను కుదించడానికి నిరసనగా స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. సీఐటీయూ, సీపీఎం, రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మికచట్టాలను అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం వాటిని కుదిస్తూ తీరని ద్రోహం చేస్తోందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలని, రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, సాగునీటి సౌకర్యం కల్పించాలని, నిరుద్యోగ సమస్య కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా జంగాలపల్లిపెద్దన్న, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, చేనేత కార్మికసంఘం నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ మండల కో-కన్వీనర్‌లు అయూబ్ ఖాన్, ఎల్ ఆది నారాయణ, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, చేనేత నాయకులు హరి, వెంకటస్వామి, ప్రజాసంఘాల నాయకులు నాగరాజు, జయ, దస్తగిరి, చౌడమ్మ, జయమ్మ, ఫాతిమ, లక్ష్మీదేవి,గంగరత్న పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ సమావేశంలో లేబర్ కోడ్‌ను అమలు చేస్తామని ప్రకటించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, రామమోహన్, బాలక్రిష్ణ, జనార్దన్, తిరుపాల్ పాల్గొన్నారు.

తిరుమలలో కళాకారుల నృత్య ప్రదర్శన

ధర్మవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో రథసప్తమి సందర్భంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో ధర్మ వరానికి చెందిన మానస నృత్యకళా కేంద్ర కళాకారులు మంగళవారం చేసిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. మానస నృత్య కళాకేంద్రం గురువు మానస వెంకటేశ్వరస్వామి, కృష్ణ అన్నమయ్య వేషధారణల్లో ఆకట్టుకున్నారు. అదేవిధంగా నాట్య బృందం కోలాట ప్రదర్శన నిర్వహించారు.



తిరుమలలో ధర్మవరం కళాకారుల ప్రదర్శన

నిర్మాణం పూర్తయి నెలైనా..!

ప్రారంభానికి నోచుకోని మరికొమ్మెదిన్నె సబ్‌స్టేషన్

నంబులపూలకుంట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలానికి ఎన్పీకుంట, వెలిచెలమల, గాజుల వారిపల్లిలోని సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఓల్టేజీతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కారానికి రూ. 3 కోట్లతో మరికొమ్మెదిన్నె వద్ద మరో సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. దీని నిర్మాణం పూర్తయి నెల రోజులైనా దాన్ని నేటికీ ప్రారంభించలేదు. ఈ సబ్‌స్టేషన్ ఎప్పుడు ప్రారంభం అవుతుందా.. విద్యుత్ సమస్యలు ఎప్పుడు పరిష్కారం అవుతాయా.. మండలంలోని రైతులు ఎదురు చూస్తున్నారు. దీన్ని ప్రారంభిస్తే.. పొలాలకు, గృహాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని.. వెంటనే దీన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఏఈ సాలేహా బాషాను వివరణ కోరగా... మరికొమ్మెదిన్నె సబ్‌స్టేషన్‌లో పనిచేసే ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ కోసం ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయని, త్వరలోనే ఎమ్మెల్యే అనుమతి తీసుకుని ప్రారంభిస్తామని తెలిపారు.



నిర్మాణం పూర్తయిన మరికొమ్మెదిన్నె సబ్‌స్టేషన్

బకాయిల కోసం నిరాహార దీక్ష చేస్తాం

చేనేత వస్త్ర వ్యాపారుల సంఘం నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో పట్టుచీరల వ్యాపారులకు బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకుంటే ఆ దుకాణాల ఎదుట నిరా హార దీక్ష చేస్తామని చేనేత పట్టుచీరల తయారీ, వస్త్రవ్యాపారుల సంఘం నాయకులు హెచ్చ రించారు. బుధవారం వస్త్ర వ్యాపారుల సంఘం పట్టణ అధ్యక్షుడు గిర్రాజు రవి, నాయకులు స్థాని కంగా మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23న ధర్మవరం చేనేత వ్యాపారులకు ఎవరెవరు బకాయిలు పడ్డారో వారి వద్దకే వెళ్లి వసూళ్లు చేస్తామ న్నారు. బకాయిలు వసూళ్లు చేయడానికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తమకు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. చేనేతల సమస్యలు విని.. వాటి శాశ్వత పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇవ్వడం శుభపరిణామమన్నారు. ధర్మవరం చేనేత పట్టు వ్యాపారులకు హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల్లో భారీ ఎత్తున బకాయిలు రావాల్సి ఉందని, జీఎస్టీపై కేంద్రంతో చర్చించి తగ్గిస్తే చేనేత మనుగడ సాధ్యమవుతుందని సీఎంను కోరినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న వస్త్ర వ్యాపార సంఘం నాయకులు

విధుల పట్ల ఇంత నిర్లక్ష్యమా..!

ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది గైర్హాజరుపై ఎంపీపీ విస్మయం

నల్లచెరువు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీపీ రమణారెడ్డి.. ఆ కార్యాలయంలో ఒక్క సీనియర్ అసిస్టెంట్ మినహా ఉద్యోగులు, సిబ్బంది లేకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. వారు విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు పలు ఫిర్యాదులు చేయడంతో ఎంపీపీ ఆ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. వెంటనే ఎంపీ డీఓ రఘునాథ్‌గుప్తకు ఫోన్ చేయగా.. తాను ఓరువాయి గ్రామ పంచాయతీలో పింఛన్ల సర్వేలో ఉన్నట్లు చెప్పారు. మిగిలిన వారి పరిస్థితి అడుగ్గా.. తాను పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌ను ఎంపీపీ చాంబర్‌కు పిలిపించి రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. అందులో ఈఓఆర్డీ శకుంతల, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కవిత, టైపిస్టు శ్రీనివాసులు సోమ, మంగళ, బుధవారం రోజుల్లో సంతకాలు లేకపోవడాన్ని గుర్తించారు. సమయపాలన పాటించకుండా ఇష్టం వచ్చినట్లు మధ్యాహ్నం 11, 12 గంటలకు రావడం.. కొంత సేపు ఉండి వెళ్లిపోవడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుం టామన్నారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ

న్యూస్ బాక్స్

నేడు ఎమ్మెల్యే సమీక్ష

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే అదేవిధంగా మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉత్తమ సర్పంచ్‌కు కలెక్టర్ అభినందన



కలెక్టర్‌తో పంచరత్నమ్మ

పుట్టపర్తిటౌన్ / రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్న నల్లచెరువు మేజర్ పంచాయతీ సర్పంచ్ పంచరత్నమ్మను కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం అభినందించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జన వరి 26న ఢిల్లీలో ఆమె కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి చేతుల మీదుగా ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్నారు. పంచాయతీ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సమత, డివిజనల్ పంచాయతీ అధికారి ఆంజనప్ప, కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

ఉచిత సేవలు ప్రారంభం

ధర్మవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ధర్మవరం జోన్ ఆధ్వర్యంలో ఉచిత సేవలకు శ్రీకారం చుట్టింది. ఈ సేవలను స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి బుధవారం ప్రారంభించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇన్‌కమ్, రిటర్న్, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ ఆన్‌లైన్ అప్లోడ్, ఉపాధ్యాయుల టీఐఎస్, జడ్పీపీజడ్, జీపీఎఫ్ మొదలైన అన్ని రకాల ఆన్‌లైన్ సర్వీసులను సంఘాలకు అతీతంగా ఉచితంగా అందిస్తామన్నారు. ఈ సేవలు ప్రతి రోజు సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి

తనకల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిరెడ్డిపల్లి పంచాయతీ సుబ్బరాయునిపల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్థులు ఎంపీడీఓ రెడ్డెప్పకు బుధవారం వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ... సుమారు ఎనిమిది దశాబ్దాలుగా తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని, దీంతో అందరూ గ్రామాన్ని విడిచి వెళ్లిపోయారని వాపోయారు. గ్రామంలో మిగిలి ఉన్నవారు కూడా వెళ్లిపోయే పరిస్థితి ఉందని, వెంటనే రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. రహదారి కోసం గ్రామ పంచాయతీ, అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించాలని కోరారు. ఎంపీడీఓ స్పందించి.. ఉపాధి పథకం కింద రహదారి నిర్మాణం చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆ గ్రామస్థులు బచ్చలి వేణుగోపాల్‌రెడ్డి, బచ్చలి సూర్యనారాయణరెడ్డి, బాబురెడ్డి, టీడీపీ బచ్చలి బ్రహ్మానందరెడ్డి, బుక్యా హరినాయక్, తనకట్టి చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దపల్లికి చెందిన తవళం హైదర్‌వలీ ఉన్నారు.

సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామంలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు బుధవారం ఆ గ్రామంలోని సచివాలయంలో జరిగాయి. అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిణి డాక్టర్ రమాదేవి తెలిపారు. అధ్యక్షుడిగా బాల గొండ మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా యల్లప్ప, డైరెక్టర్లగా శంకరయ్య, ఈశ్వరయ్య, వీరనారప్ప, పుల్లప్ప, పామాల వీరనారప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మండల మాజీ కన్వీనర్ గొట్లూరు శ్రీనివాసులు వారిని సన్మానించారు.

జీతాలు అందని ఉపాధి సిబ్బంది

తనకల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమకు ఆరునెలలుగా జీతాలు అందలేదని ఆవేదన చెందారు. తాము పని చేస్తుంటే.. జీతాలు మాత్రం తమకంటే ముందు పనిచేసి .. తొలగించిన వారికి చెల్లిస్తున్నారని వాపోతున్నారు. అధికారులు మాత్రం జీతాలు ఇవ్వకుండా కూలీల సంఖ్య పెంచాలని తమను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తమకు వెంటనే జీతాలు రావని, జాయిన్ చేసుకున్న రోజు నుంచి మాత్రమే జీతం వస్తుందని సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని డ్వామా కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, ఏపీడీ చెబుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి.. తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎంపీడీఓ రెడ్డెప్పను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. జిల్లా అధికారులు జాయిన్ అయిన రోజు నుంచి జీతం తప్పకుండా వస్తుందని చెప్పారు.

ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోండి

ధర్మవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డీఎస్పీ హేమంత్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి మునుగు మధు, నాయకులు డీఎస్పీకి వినతిపత్రం ఇచ్చారు. పలు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల ఏజెంట్లు కస్టమర్లతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఒక కంతు పెండింగ్ ఉన్నా దాడులు చేయడం, దుర్భాషలాడడం, ఇంటి దగ్గరికి వచ్చి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం చేస్తున్నారన్నారు. అమాయకుల ఆర్థిక ఇబ్బందులు ఆసరాగా చేసుకుని.. వారే లోన్ ఇచ్చి... వడ్డీ మీద వడ్డీలు వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వీరి దౌర్జన్యాలకు భయపడి ఇప్పటికే చాలా మంది ఆత్మహత్య చేసుకున్నారన్నారు. డీఎస్పీని కలిసిన వారిలో సీపీఐ పట్టణ కార్యదర్శి రవి, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ, నాయకులు శ్రీనివాసులు, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా మహాలక్ష్మి బాధ్యతల స్వీకరణ



ధర్మవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా మహాలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీకాంతరెడ్డి జనవరి 31న ఉద్యోగ విరమణ పొందారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

ముదిగుబ్బ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం బుధవారం తనిఖీ చేశారు. ఆమె వెంట మండల వైద్యాధికారి రాజేంద్ర, సీహెచ్‌ఓ సరస్వతమ్మ, సిబ్బంది ఉన్నారు.

కస్తూర్బా విద్యాలయంలో..

ఓబుళదేవరచెరువు: మండలంలోని వడ్డివారిపల్లి వద్ద ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ దేవరాజ్ బుధవారం తనిఖీ చేశారు. పదిలో వందశాతం ఉత్తీర్ణతకు కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమస్యలపై విద్యార్థినులతో ఆరా తీశారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు.

అగ్నిమాపక కేంద్రంలో..

కదిరిఅర్బన్: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని రీజనల్ ఫైర్ అధికారి ఎం.భూపాల్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులు పరిశీలించారు. మీడియాతో మాట్లాడుతూ ఓడీసీ వద్ద అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 57 మంది గైర్హాజర్

కొత్తచెరువు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు బుధవారం నిర్వహించిన.. ప్రాక్టికల్స్‌కు 57 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు డీఐఈఓ రఘునాథ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సర విద్యా ర్థులు 594 మందికి గాను 549 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థు లు 482 మందికి గాను 470 మంది హాజరయ్యారని తెలిపారు.

చిన్నారులను చేరదీసిన 'మాతృశ్రీ'

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల మధ్య విభేదాల కారణంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఇద్దరు చిన్నారులను అమడగూరు మండలంలోని గాజులవారిపల్లి వద్ద ఉన్న మాతృశ్రీ వృద్ధాశ్రమ నిర్వాహకులు అరుణజ్యోతి అక్కున చేర్చుకు న్నారు. సోమందేపల్లి మండలంలో దంపతులు విడిపోయారు. ఇద్ద రు పిల్లలను తండ్రి పోషించలేక.. ఆర్థిక ఇబ్బందులతో సతమత మవు తున్నాడు. ఈ విషయాన్ని సోమందేపల్లి ఎస్ఐ రమేష్ మాతృశ్రీ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతికి సమాచారం ఇచ్చారు. ఆ పిల్లలను చేరదీయడానికి ఆమె అంగీకరించింది. దీంతో బుధవారం అమడగూరు ఎస్ఐ వెంకట నారాయణ, సోమందేపల్లి గ్రామ పెద్దలు ఆ పిల్లలను ఆమెకు అప్పగించారు.

శ్మశానవాటికకు స్థల పరిశీలన

ముదిగుబ్బ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత ఊరు సమీ పంలో హిందూ శ్మశానవాటిక కోసం తహసీల్దార్ నారాయణస్వామి, మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ స్థలాన్ని బుధవారం పరిశీలించారు. తహసిల్దార్ మాట్లాడుతూ.. శ్మశానవాటిక లేకపోవడంతో రోడ్డు ప్రక్కన, వంకల్లో పూడ్చుకునే పరిస్థితి ఉందని, దీంతో హిందూ శ్మశాన వాటికకు స్థలం కోసం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వారి వెంట టీడీపీ నాయకులు కోట్ల బాబి, నాయకులు ఉన్నారు.

ట్రాన్‌ఫార్మర్ ఏర్పాటు

కొత్తచెరువు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమర్ల గ్రామ సమీపంలో జగనన్న కాలనీలో అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆ గ్రామ మాజీ సర్పంచ్, వైసీపీ నేత ఎలాంటి అనుమతులూ లేకుండా తీసుకెళ్లి.. తన వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసుకున్నాడు. ఈ విషయాన్ని ఆ గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయడం, పత్రికల్లో రావడంతో ట్రాన్స్‌కో అధికారులు మేలుకున్నారు. బుధవారం ట్రాన్స్‌కో అధికారులు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకువచ్చి జగనన్న కాలనీలో ఏర్పాటు చేశారు.



వైసీపీ నుంచి బీజేపీలోకి చేరిన కార్యకర్తలు

వైసీపీ నుంచి బీజేపీలోకి భారీగా చేరికలు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంట గ్రామంలో బీజేపీ నాయకులు అంగజాల రాజు, సర్పంచ్ నాగవేణి ఆధ్వర్యంలో సుమారు 150 మంది వైసీపీ కార్యకర్తలు బీజేపీలో చేరారు. బుధవారం ఆ గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, అనంతపురంజిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి హరీష్‌బాబు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి అవినీతి, అక్రమాలు వెలికతీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంబటి సతీష్, రూరల్ కన్వీనర్ గొట్లూరు చంద్ర, సాకే ఓబిలేసు, డోలా రాజారెడ్డి, లీలావతి, జమీర్, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

● బీజేపీ ఫ్లెక్సీల చించివేత: ఈ కార్యక్రమం సందర్భంగా గ్రామంలో రహదారుల పక్కన బీజేపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి కోసేశాడు. దీన్ని గమనించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు అతనిపై దాడికి యత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు అతన్ని అరెస్టు చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

శివరాత్రిని ప్రశాంతంగా జరుపుకోండి



చిల్లవారిపల్లివాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ, ఎస్ఐ

తాడిమర్రి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లవారిపల్లి కాటకోటేశ్వరక్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలను ఎలాంటి సమస్యలకూ తావు ఇవ్వకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన చిల్లవారిపల్లి కాటకోటేశ్వరక్షేత్రంలో స్థానిక ఎస్ఐ క్రిష్ణవేణితో కలిసి పర్యటించారు. అక్కడ శివరాత్రి సందర్భంగా ఆలయంలో నిర్వహించే పూజా కార్యక్రమాలను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిల్లవారిపల్లిలో పెద్దమ్మస్వామి ఆలయం వద్ద గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. వివాదాలకు వెళ్లకుండా పండుగను ప్రశాంతంగా జరుపుకునేందుకు అందరూ సహక రించాలని, ఎవరైన అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగ్గురు అనుమానితుల అరెస్ట్

కదిరిఅర్బన్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రదొడ్డి ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో అనుమానంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద ఉన్న ఖాళీ సంచులు, అందులో ఉన్న కటింగ్ బ్లేడు, వైరు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని కదిరిలోని అమీనగర్‌కు చెందిన నగేష్, బాదల వలీ, కర్ణాటక పావుగడకు చెందిన వినీత్‌కుమార్ గా గుర్తించామన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

బత్తలపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్రాచెరువు గ్రామంలో ఉపాధి పథకం కింద చేస్తున్న పనులను ఎంపీడీఓ నరసింహానాయుడు బుధవారం తనిఖీ చేశారు. ఆయన వెంట ఈసీ నాగార్జున, సిబ్బంది ఉన్నారు.

ఆకట్టుకున్న ఆటోమోటివ్ ఎగ్జిబిషన్

నల్లచెరువు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఆటోమోటివ్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. దీన్ని ప్రిన్సిపాల్ రణాప్రతాప్ నాయక్ ప్రారంభించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ బాబాఫక్రుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

క్రైం న్యూస్..

మహిళ ఆత్మహత్య

కదిరి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక అడపాల వీధికి చెందిన స్వాతి (30) ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తలుపుల మండలంలోని ఏపులపల్లికి చెందిన రామకృష్ణ కుమార్తె స్వాతిని నల్లమాడ మండలం వెంకటరెడ్డిపల్లికి చెందిన కేశవయ్యకిచ్చి 11 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వీరు కుర్చీల వ్యాపారం చేసుకుంటూ అడపాల వీధిలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. కేశవయ్య రోజూ మద్యం తాగి వచ్చి స్వాతిని వేధిస్తుండేవాడు. అనుమానించి కొట్టేవాడు. వీటిని భరించలేక స్వాతి బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని, మరణించింది. తమ కుమార్తె చావుకు కేశవయ్య కారణమని స్వాతి తండ్రి రామకృష్ణ.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



గంగరాజు మృతదేహం

ముదిగుబ్బ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిగుబ్బ, చెన్నేకుంటపల్లి రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు నుంచి జారిపడి ఓ యువకుడు మృతి చెందినట్లు ధర్మవరం రైల్వే ఎస్ఐ దేవదాస్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. గాండ్లపెంట మండలంలోని వంకపల్లికి చెందిన పల్లెపు గంగరాజు (35) మంగళవారం రాత్రి తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్లే రైల్లో ప్రయాణిస్తుండగా చిన్నేకుంటపల్లి, ముదిగుబ్బ రైల్వే స్టేషన్ల మధ్యలో జారి పడి మృతి చెందాడు. మృతుడు హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. మృతుడికి భార్య కుమారి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

మామిడి చెట్లకు నిప్పు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని జౌకలకొత్తపల్లి గ్రామ పొలం సర్వేనెంబర్ 1213-3లో సాగు చేసిన మామిడి చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం నిప్పు పెట్టడంతో అవి దగ్ధమయ్యాయి. బాధితులు లోకిలోని రాజు, సులో చన దంపతు లు బుధవారం మాట్లాడుతూ.. మూడు ఎకరాల్లో 8 సంవత్స రాల క్రితం 450 మామిడి చెట్లను పెంచామని, ప్రస్తు తం పూత దశలో ఉన్నయని తెలిపారు. వాటికి నిప్పు పెట్టడంతో చెట్లు మొత్తం కాలిపోయాయని ఆవేదన చెందారు. పంట చేతికొచ్చే సమయంలో తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. దీనిపై పోలీ సులకు ఫిర్యాదు చేశామని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసముద్రం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ముదిగుబ్బ మండలం సానేవారిపల్లికి చెందిన గణేష్, నజీరుల్లా ద్విచక్రవాహనంలో కదిరి నుంచి మలకవేముల వైపు బయలుదేరారు. ఎర్రదొడ్డికి చెందిన ఆటోడ్రైవర్ అల్లాబక్ష కదిరి నుంచి వస్తుండగా.. ద్విచక్రవాహనం వెళ్లి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో గణేష్‌కు తీవ్రగాయాలు కాగా 108ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. మిగిలిన ఇద్దరికి స్వల్పగాయాలు కాగా కదిరిలో చికిత్స పొందుతున్నారు.

ఎన్పీకుంటలో ఇద్దరికి..

నంబులపూలకుంట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతి గృహం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన మామ, మేనల్లుడు పుల్లారెడ్డి, హర్షవర్ధన్ గాయపడ్డారు. వీరు బైక్‌లో అన్నమయ్య జిల్లాలోని గాలివీడు నుంచి వస్తుండగా.. ఆవు దూడ అడ్డురావడంతో అదుపు తప్పి కిందపడ్డారు. పుల్లారెడ్డి తలకు బలమైన గాయం కావడంతో 108 వాహనంలో అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి తరలించారు. హర్షవర్ధన్‌కు స్వల్పగాయాలయ్యాయి.

ఘర్షణలో వ్యక్తికి..

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలేపల్లి వద్ద బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. కదిరి పట్టణానికి చెందిన సిదార్థ కౌలేపల్లి వద్ద ఓ దుకాణంలో వాటర్ బాటిల్ కొనుగోలు చేశారు. చిల్లర విషయంలో దుకాణదారుడికి, సిదార్థకు వాగ్వివాదం జరిగింది. దుకాణదారుడు సిదార్థ తలపై కట్టెతో కొట్టాడు. దీంతో అతన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జూదరుల అరెస్టు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకుల వారిపల్లివద్ద పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు బుధవారం రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి తెలిపారు. వారినుంచి రూ.7,050 స్వాధీనం చేసుకున్నామన్నారు. తహసీల్దార్ వద్ద అరెస్టు చేసిన వారిని బైండోవర్ చేశామన్నారు.

రీసర్వేలో అన్నీ అవకతవకలే!

● తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణ

మడకశిర రూరల్ ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : జగనన్న భూముల రీసర్వేలో భాగంగా జరిగిన అవకతవకలకు అంతేలేదు. నిదానంగా అందరి సమక్షంలో చేయాల్సిన సర్వేను హడావిడిగా ముగించడంతో సర్వే అంతా తప్పులతడకగా జరిగింది. ఇందులో కొందరికి మేలు జరగగా, ఎక్కువ మంది విషయంలో అన్యాయం చోటుచేసుకుంది. రీసర్వేలో భూములు తక్కువ ఉన్నవారికి ఎక్కువగా, ఎక్కువగా ఉన్న రైతులకు తక్కువగా నమోదుచేసి పాసుపుస్తకాలు ఇచ్చారు. ఇదేంటని అడిగితే సమాధానం చెప్పకపోవడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. బ్యాంకుల వద్దకు వెళితే వారు తప్పుల తడకగా మారిన పాస్ పుస్తకాలకు రుణాలను ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. ఏం చేయాలో పాలుపోక రైతులు జుట్టుపీక్కుంటున్నారు. ఈ తప్పులను సరిచేయాలని మొత్తుకుంటున్నారు. దీంతో గత మూడేళ్లుగా రైతులు భూముల రీసర్వేలో జరిగిన అవకతవకలు సరిచేసుకోవడానికి తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తమ భూముల విస్తీర్ణంలో అవకతవకలు సరిచేయాలని కోరుతూ కల్లుమర్రి గ్రామానికి చెందిన రైతులు బుధవారం మండల సర్వేయరుకు వినతి పత్రాన్ని అందజేశారు.



సర్వేయరుకు వినతి పత్రం ఇస్తున్న కల్లుమర్రి రైతులు

లేని భూములను నా పాస్‌పుస్తకంలో కలిపారు

జగనన్న భూముల సర్వేవల్ల భూముల్లో అనేక అవకతవకలు జరిగాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాకు 4.10 ఎకరాల భూమి ఉండగా, భూముల రీసర్వేలో ఆరు ఎకరాలు ఉన్నట్లు పాసుపుస్తకం ఇచ్చారు. నాకు లేని భూమిని కలిపి పాసుపుస్తకంలో నమోదు చేశారు. దానిని సరిచేయాలని గత మూడేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను.



మల్లేష్, రైతు కల్లుమర్రి

రీసర్వేలో నా భూమి విస్తీర్ణాన్ని తగ్గించారు

గ్రామంలో నాకు 7 ఎకరాల భూమి ఉండగా అందులో 0.49 సెంట్లు తక్కువచేసి పాసుపుస్తకం ఇచ్చారు. దానిని సరిచేసి నా భూమిని పాసుపుస్తకంలో కలిపి ఇవ్వాలని అనేకసార్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.



శివరామ్ గౌడ్, రైతు, కల్లుమర్రి

కార్మిక చట్టాలను అమలు చేయండి: సీఐటీయూ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎంతో మంది ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఇందిర పార్కు నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికచట్టాలు అమలు విషయమై బుధవారం దేశ వ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా నిరసన చేపట్టారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచి పోరాటాలు చేసి 29 కార్మిక చట్టాలను సాధించారన్నారు. అయితే మోదీ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. కోవిడ్ కాలంలో 2019లో వేతనాల కోడ్, 2020లో పరిశ్రమల సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ ఆమోదించి రెండు రోజుల్లో రాష్ట్రపతి ముద్ర వేయించారన్నారు. ఏనాడైనా వాటి అమలు ఉత్తర్వులు ఇస్తామని ప్రీ బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ కార్మిక నాయకుల సమక్షంలో ప్రకటించారన్నారు. కొద్దిపాటిగా ఉన్న కార్మిక చట్టాలను కుదించడమే లేబర్ కోడ్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కోడ్ ల వల్ల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, ఉద్యోగ భద్రత కోల్పోతామన్నారు. కార్మికులు పరిశ్రమల యజమానుల వద్ద పెట్టుబడిదారుల దగ్గర కట్టు బానిసలుగా ఉండాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా స్వామి నాథన్ కమిషన్ చెప్పిన విధంగా రైతులకు పెట్టుబడి కి అదనంగా 50 శాతం గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రీకాట్ బీ యూనియన్ నాయకులు సిద్దారెడ్డి, నందీశ్వర, లక్ష్మయ్య, మారుతిరెడ్డి, గంగాధర్, నూగూరు నారాయణ, మునిసిపల్ యూనియన్ కార్యదర్శి జగదీష్, అంగన్‌వాడీ నాయకురాలు అరుణ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

పనిచేయని సర్వర్.. ఖాతాదారుల అవస్థలు

మడకశిరరూరల్ ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మడకశిరలోని ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో సర్వర్ పనిచేయకపోవడంతో ఖాతాదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మండలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు అన్ని పనులు వదులుకొని రుణాల కోసం, నగదు కోసం బ్యాంక్‌కు వస్తున్నారు. బ్యాంక్‌లో సర్వర్ పనిచేయకపోవడంతో గంటల తరబడి అన్ని పనులు వదిలివేసి బ్యాంక్ దగ్గరే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. గత నెల రోజులుగా ఈ విధంగా జరుగుతున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. చాల మంది వినియోగదారులు బ్యాంక్‌పై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బ్యాంక్ అధికారులు స్పందించి సర్వర్ సమస్యను పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ రాఘవేంద్ర మాట్లాడుతూ బ్యాంక్‌ను నెలరోజులక్రితం నూతనభవనంలోకి మార్చామని, దీంతో సర్వర్ సమస్య ఏర్పడిందని, త్వరలో దీనిని పరిష్కరిస్తామన్నారు.



పావగడ గంగమ్మకు ఉత్తమ కాయకబంధు పురస్కారం



గంగమ్మకు కాయకబంధు పురస్కారం అందజేస్తున్న మంత్రి, సీఎస్

పావగడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పావగడ మండలం సీకేపురం గ్రామ పంచాయతీలోని 320కుటుంబాలకు నరేగ పనులు కల్పించి అందులో 246కుటుంబాలు వంద రోజుల పనులు సద్వినియోగం చేసుకోవడానికి కృషిచేసిన పావగడ గంగమ్మకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ కాయకబంధ్ (మేట్) పురస్కారం లభించింది. బెంగళూరులోని అంబేద్కర్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్‌శాఖ కార్యక్రమంలో ఆమెకు ఈ పురస్కారం అందజేశారు. 2023-24సంవత్సరానికి గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన పాఠశాల అభివృద్ధి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పనులు చేపట్టడానికి ప్రభుత్వం 123కోట్లు ఖర్చుచేసింది. తుమకూరు జిల్లాలోని కుణిగల్ తాలూకా ఉజ్జయినీ ఉత్తమ గ్రామ పంచాయతీకి పురస్కారం లభించింది. పావగడలో గంగమ్మకు కాయకబంధు పురస్కారం లభించడంతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీశాఖ మంత్రి ప్రియాంకఖర్గే, తుమకూరు జిల్లా పంచాయతీ సీఎస్ ప్రభు చేతులమీదుగా గంగమ్మకు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆమెకు అభినందనలు తెలిపారు.

హిరేతుర్పిలో ఘనంగా ఉట్ల పరుష



ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

గుడిబండ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిరేతుర్పి గ్రామంలో ఆంజనేయస్వామి ఉత్సవాల్లో భాగంగా గ్రామస్థుల ఆధ్వర్యంలో బుధవారం ఉట్ల పరుష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉట్ల పరుష కార్యక్రమంలో భాగంగా ఉట్లమాను ఏర్పాటుచేసి బురద మట్టి పూసి ఉట్లమానుకు నూనె పోసి పైన కొబ్బరికాయలు కట్టారు. యువకులు ఉట్లమాను ఎక్కి కొబ్బరి కాయలు ఎవరు తొలగిస్తారోనన్న ఉత్కంఠ నెలకొనగా, దాసరిపల్లి గ్రామానికి చెందిన యువకులు ఒకరిపై ఒకరు పోటీపడి ఉట్లమాను ఎక్కేందుకు పోటీబడ్డారు. అయితే మానుకు నూనె పూయడంతో కిందకు జారి పడ్డారు. రాజు అనే యువకుడు సాహసం చేసి ఉట్లమాను ఎక్కి కొబ్బరికాయలు తీసి శభాష్ అనిపించుకొన్నాడు. గ్రామస్థులు అతడిని అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఆంజనేయస్వామిభక్తులు భారీగా పాల్గొన్నారు.

మల్లినమడుగులో ఇంకా అంటరాని తనం: కేవీపీఎస్

రొళ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలం మల్లినమడుగు గ్రామంలోని లక్ష్మీ ఆలయ ఆవరణంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో బుధవారం దళితుల సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లినమడుగులో స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ అంటరానితనం నిర్మూలించడంలో విఫలమయ్యారన్నారు. ఎన్ని రాజకీయ పార్టీల అధికారులు వచ్చినా దళితులను వాడుకోవడం తప్ప అంబేద్కర్ ఏదైతే ఆశించారో దానిని ఆచరించలేదన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించే విధంగా పాలకులు నడుచుకోవడం లేదని విమర్శించారు. ఈగ్రామంలో చెప్పలేనంత వివక్ష కొనసాగుతుంటే మండల అధికారులు, 105 జీవో అమలు చేయడం లేదని, చట్టాలపై అవగాహన కల్పించి ఉంటే ఇలాంటి దుస్థితి వచ్చేది కాదని పేర్కొన్నారు. ఈగ్రామంలో ఎలాంటి గొడవలు జరిగినా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ కన్వీనర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఈసందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, నాయకులు మురళి, రంగనాథప్ప పాల్గొన్నారు.



ఆలయం వద్ద అవగాహన కల్పిస్తున్న జిల్లా కార్యదర్శి రమణ

న్యూస్ బాక్స్

బీపీ పరికరాల వితరణ



బీపీ మానిటర్లను, పౌష్టికాహారాన్ని అందజేస్తున్న కన్వీనర్

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గర్భవతులకు వైద్య పరీక్షలు చేసేందుకు బీపీ మానిటర్ పరికరాలను టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు అందించారు. బుధవారం పట్టణంలోని బీటీఆర్ కాలనీలోని అంగన్‌వాడీ ఏఎన్ఎంలకు ఈ పరికరాలు అందజేశారు. అనంతరం గర్భవతులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు బాలింతలకు పౌష్టికాహారం అందిస్తుందని వాటన్నింటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై మంత్రికి ఫిర్యాదు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు సౌమ్య వేధింపులపై బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు ఆశ వర్కర్లు ఫిర్యాదు చేశారు. వారు బుధవారం మంత్రిని కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు మాట్లాడుతూ వైద్యురాలు సౌమ్య కక్షసాధింపుతో ప్రతిరోజూ తమను నానాదుర్భాషలాడి ఇష్టానుసారంగా దూషిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు తులసి, రాజేశ్వరి, అలివేలమ్మ, గౌతమి, తదితర ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సూర్యనమస్కారాలు చేస్తే ప్రతి వ్యక్తి సంపూర్ణ ఆరోగ్య వంతుడిగా మారతారని వివేకానంద యోగా థెరపీ కార్యదర్శి జయప్రకాష్, సహాయ కార్యదర్శి బద్రీనాథ్, వెంకటరాముడు పేర్కొన్నారు. రథసప్తమిని పురస్కరించుకొని హిందూపురం నింకంపల్లి రోడ్డులోని విద్యారణ్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రథసప్తమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. 200 మంది విద్యార్థులు 108 సూర్య నమస్కారాలు చేశారు. ప్రపంచ దేశాల్లో ఎక్కడ లేని విధంగా మన దేశంలో పూర్వ కాలం నుంచి రుషులు, మహర్షులు, సూర్యభగవానుడికి నమస్కరిస్తూ ఆసనాలు వేసేవారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవాంగం శంకరప్ప, హెచ్ఎం సేబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కడ షష్టి విశేష పూజలు



విశేష అలంకరణలో స్వామి

చిలమత్తూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కడషష్టి సందర్భంగా మండలంలోని చేనేపల్లి గ్రామంలో వెలసిన సుబ్రమణ్యేశ్వర స్వామికి బుధవారం విశేషపూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకం, అనంతరం పుష్పాలంకరణ చేశారు. అనంతరం మహామంగళహారతి ఇచ్చి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులు భారీగా వచ్చి మొక్కులు తీర్చుకొని స్వామి దర్శనం చేసుకున్నారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా విక్టోరియా



అగళి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అగళి మండల బీజేపీ అధ్యక్షురాలిగా విక్టోరియా రాణిని పార్టీ అధిష్ఠానం నియమించింది. మంగళవారం జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల్లో విక్టోరియా రాణిని అగళి మండల బీజేపీ అధ్యక్షురాలిగా ప్రకటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ అగళి మండల చరిత్రలో ఒక మహిళను అధ్యక్షురాలిగా మొదటిసారిగా ఎన్నుకొన్నారన్నారు. గత పదేళ్లుగా పార్టీలో నిస్వార్థ కార్యకర్తగా పనిచేస్తూ అనేక ఉద్యమాల్లో పాల్గొని ప్రజల కోసం పోరాడిన తనను పార్టీ అధిష్ఠానం గుర్తించినందుకు పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. భారతీయ జనతాపార్టీ పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు, మీడియా మిత్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అంబులెన్స్‌ను ప్రారంభించిన టీడీపీ నేతలు

రొళ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని టోల్ ప్లాజా వద్ద టీడీపీ నాయకులు అంబులెన్స్‌ను ప్రారంభించారు. హైవేలో ప్రమాదం జరిగితే 1033 నెంబర్‌కు ఫోన్ చేసి దానిని ఉపయోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, బ్యాడిగెరె మూర్తి, భరత్, రామకృష్ణ, రాజన్న పాల్గొన్నారు.

'లక్ష డప్పులు వెయ్యి గొంతులు' పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

మడకశిర టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేటర్ కె.భూతన్న, జిల్లా కార్యదర్శి మహాలింగప్పలు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన లక్ష డప్పులు, వెయ్యి గొంతుల కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్ మహానగరంలో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి ఈకార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈసందర్భంగా సీనియర్ నాయకులు డాక్టర్ రంగస్వామి, ఎం.ఆర్.రంగనాథ్, నాగేష్, తదితరులు ఉన్నారు.

పంట వ్యర్థాలకు నిప్పు.. నేల సారానికి ముప్పు

లేపాక్షి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాల్లో నిప్పుపెట్టడంవల్ల భూసారానికి ముప్పు ఏర్పడుతుందని అనుభవజ్ఞులైన రైతులు చెబుతున్న కొంతమంది రైతులు వినడంలేదు. దీంతో పంటల కాలం ముగియగానే పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. దీనివల్ల భూమిసారం కోల్పోవడమేకాక అనేక అనర్థాలకు దారితీస్తుంది. అధికారులు రైతులకు పూర్తిగా అవగాహన కల్పించాల్సి ఉంది.

8న రంగనాథస్వామి ఉత్సవాలు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిరుమదేవరపల్లి కొండపై వెలిసిన రంగనాథస్వామి, శనేశ్వరస్వామి ఉత్సవాలను ఈనెల 8వతేదీన పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 5 గంటల నుండి 6 గంటల వరకు గంగపూజ, 7.30 గంటల వరకు స్వామివారికి అభిషేకాలు, 9 గంటలకు అలంకరణ, 10.30 గంటలకు జ్యోతుల ఉత్సవం, 11 గంటలకు నవగ్రహ పూజతోపాటు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు లింగప్ప తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఇజ్‌తెమాను సందర్శించిన మంత్రి సవిత



జ్యూస్ పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : పెనుకొండ పట్టణం రైల్వే స్టేషన్ సమీపంలో రెండ్రోజులపాటు జరుగుతున్న ఇజ్‌తెమా కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత బుధవారం సందర్శించారు. స్థానిక నాయకులతో కలిసి సభవద్దకు వెళ్లారు. అక్కడ ఏర్పాట్లు తదితర వాటిపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెనుకొండ అంటేనే ఒక చరిత్ర ఉందన్నారు. పెనుకొండలో ప్రసిద్ధిగాంచిన దాదాపు 350దేవాలయాలతోపాటు ప్రఖ్యాతిగాంచిన శ్రీబాబయ్యస్వామి దర్గా, పాంచ్‌బీబీ దర్గా, పురాతన షేర్‌ఖాన్ మసీదు ఉన్నాయని కొనియాడారు. బాబయ్య పరుష జరిగినా, వినాయక నిమజ్జనం జరిగినా సోదరభావంతో చేసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో షౌకత్, పోతిరెడ్డి, కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆరుబయటే.. వారపు సంత

చిలమత్తూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారపు సంత ఎన్నో ఏళ్లుగా ఆరుబయల్లోనే కొనసాగుతోంది. మార్కెట్ గదుల నిర్మాణాలకు నాబార్డు నుంచి సహకారం అందించినా, వాటి నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. మండలంలో ఎన్నో ఏళ్ల నుంచి కోడూరు, చిలమత్తూరు వారపు సంతలు కొనసాగుతున్నాయి. అయితే వాటిని అభివృద్ధి చేసి వారపు సంత సంప్రదాయాన్ని బ్రతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చిలమత్తూరు వారపు సంతకు గత ఎనిమిదేళ్ల క్రితమే నాబార్డు ద్వారా రెండు విడుతలుగా రూ. 25 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో వారపు సంతకు అవసరమైన గదుల నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. అయితే అరకొర నిధులు రావడంతో షెడ్డు నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దాంతో ప్రతి శనివారం జరిగే వారపుసంత ఆరుబయల్లోనే, మురుగు కాలువ మధ్యనే కొనసాగుతోంది. భవనాలు లేని కారణంగా వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

బంగారు ఆభరణాలు కడిగిస్తానని మోసం



నగల దొంగ దిలీప్‌కుమార్‌సాహూ (కింద కూర్చున్న వ్యక్తి)

అగళి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అగళి మండలం ఇరిగేపల్లి గ్రామానికి బుధవారం బంగారు ఆభరణములు కడిగిస్తానని ఓ వ్యక్తి వచ్చాడు. ఇరిగేపల్లి ఆయకట్టు ప్రెసిడెంట్ మంజునాథ్ భార్య గంగమ్మ దగ్గర 35గ్రాముల బంగారు గొలుసును కడిగిస్తానని చెప్పి తీసుకున్నాడు. బంగారు గొలుసు కడిగిన తరువాత 25గ్రాములు మాత్రమే ఉందని తెలియడంతో బంగారు గొలుసుతో పాటు దొంగను అగళి టీడీపీ జడ్పీటీసీ ఉమేష్ ఇంటిదగ్గరకు తీసుకెళ్లి విచారించారు. వెంటనే ముద్దాయి దిలీప్‌కుమార్‌సాహూను అగళి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీరాములుకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు మాట్లాడుతూ ఇలాంటి చోరీలకు పాల్పడే వ్యక్తులు అధికంగా సంచరిస్తున్నారని వారిపైన ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

జ్వరంతో బాలుడి మృతి



కరుణాకర్ (ఫైల్)

పావగడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూ జ్వరంతో ఆసుపత్రికి తీసుకువచ్చిన కరుణాకర్(7) అనే బాలుడికి నయం చేస్తానని చికిత్స అందించి పరిస్థితి విషమించడంతో చేతులెత్తేసిన డాక్టర్ ఉదంతం ఇది. చివరిక్షణంలో బెంగళూరుకు తీసుకెళ్లాలని చెప్పడంతో ఆ బాలుడు మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు పట్టణ ప్రజలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. పట్టణానికి చెందిన కుమార్ కొడుకు కరుణాకర్‌కు నాలుగు రోజుల నుంచి తీవ్ర జ్వరం వస్తోంది. అది డెంగ్యూఅని వైద్యుడు నిర్ణయించాక తాను నయం చేస్తానని తుమకూరు రోడ్డులోని సుధ ప్రైవేట్ క్లినిక్ వైద్యుడు డా.సుధాకర్‌రెడ్డి అధిక మొత్తంలో డబ్బు గుంజుకుని నయంచేయక చివరి క్షణంలో బెంగళూరుకు తీసుకెళ్లాలని తెలిపాడు. చివరకు బాలుడు చనిపోయిన తరువాత కూడా వైద్యుడు నిర్లక్ష్యసమాధానం ఇవ్వడంతో పట్టణ ప్రజలు ఆసుపత్రి ముందు పెద్దఎత్తున గుమిగూడి వైద్యుని తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరిని డబ్బులు అడిగి వైద్యం అందిస్తున్నాడని ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని వారు నిరసన వ్యక్తం చేశారు. ఒక సెలెన్ బాటిల్ అమర్చడానికి రూ.1500 తీసుకుంటాడని బాలుడి తండ్రి కుమార్ ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన పూజారి

సోమందేపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే సోమందేపల్లి మండలం నల్లగొండ్రాయనపల్లి సమీపంలో జాతీయ రహదారిపై యూటర్న్‌వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో సోమందేపల్లి పెద్దమ్మగుడి పూజారి శ్రీరాములు తీవ్రంగా గాయపడగా నాగినాయనిచెరువుకు చెందిన పవన్ కుమార్ స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకిందపడి వృద్ధుడి మృతి

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో రైలుకిందపడి వడ్డె అంజినప్ప(60) మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ యర్రిస్వామి తెలిపారు. మంగాపురం సమీపంలోని రైలు పట్టాలపై మృతదేహం పడిఉన్నట్లు కీమెన్ సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. పట్టాల పక్కన సెల్‌ఫోన్ ఆధారంతో మృతుడు వడ్డె అంజినప్పగా గుర్తించినట్లు తెలిపారు. గోరంట్ల మండలం భూగానపల్లి గ్రామానికి చెందిన వడ్డెఅంజినప్ప కొన్నిరోజులుగా లివర్ చెడిపోయి కడుపునొప్పితో బాధపడుతుండేవాడని మనస్థాపానికి గురై రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.